

మంత్రి వర్గ సమావేశంలో మండిపల్లి


# వైఎస్ఆర్-అన్నమయ్య

తెలుగు జాతీయ దినపత్రిక

వార్త

మంగళవారం 18 మార్చి 2025


## తండ్రి మృతి.. బాధతోనే పది పరీక్షకు హాజరైన కుమార్తె రవళి

**వేంపల్లి, మార్చి 17, ప్రభాతవార్త :**



వేంపల్లి మండలం లోని కుమ్మరాంపల్లి కి చెందినా రవళి అనే ఆంధ్ర విద్యార్థిని తండ్రి గోపాల్ ఆదివారం మృతిచెందారు. పుట్టెడు దుఖంలో ఉన్న కుమార్తె రవళికి సోమవారం నుండి పదో తరగతి పరీక్షలు ప్రారంభం అయ్యాయి. ఈ నేపథ్యం లో భవిత కేంద్రంలో పనిచేస్తున్న సహిత విద్యా ఉపాధ్యాయురాలు సుజాత రవళి ఇంటికి వెళ్లి ఆ విద్యార్థినిని ఓదార్చింది. మనో ధైర్యాన్ని నింపింది. దీంతో బాధతోనే రవళి పది పరీక్షలకు హాజరైంది. విద్యార్థినికి మానసిక స్థైర్యాన్ని నింపిన సహిత విద్యా ఉపాధ్యాయురాలు సుజాత ను పలువురు అభినందించారు. ఎంఈవోలు జాఫర్ సాదిక్, స్టాలిన్, ఐఈఆర్టీ యశోద, తదితరులు ఆమెను అభినందించారు.

### అర్జీదారులకు నాణ్యమైన

# పరిష్కారం చూపాలి

### అధికారులు అర్జీదారుల సమస్యలపై నిర్లక్ష్యం వహించరాదు.

### జిల్లా జాయింట్ కలెక్టర్ అదితి సింగ్



**కడప, మార్చి, 17 : ప్రభాతవార్త**

ప్రజాసమస్యల పరిష్కార వేదిక ద్వారా అందిన అర్జీలకు త్వరితగతిన నాణ్యమైన పరిష్కారాన్ని అందించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ అదితి సింగ్ అన్ని శాఖల అధికారులను ఆదేశించారు. సోమవారం సభ భవన్ లో ఏర్పాటు చేసిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (పిజిఆర్ఎస్) లో జిల్లా జాయింట్ కలెక్టర్ అదితి సింగ్ ప్రజల నుండి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... ఫిర్యాదుదారుల విజ్ఞప్తులను సంబంధిత అధికారులు .. క్షేత్ర స్థాయికి స్వయంగా వెళ్లి క్షుణ్ణంగా పరిశీలించి పారదర్శకంగా విచారణ చేసి, అర్జీదారుడు సంతృప్తి చెందేలా నిర్ణీత గడువులోపు తప్పనిసరిగా పరిష్కరించాలన్నారు. క్రింది స్థాయి అధికారులను పంపకుండా స్వయంగా అధికారి నే వెళ్లాలని అర్జీదారుడు సంతృప్తి చెందేలా అర్జీలను పరిష్కరించాలన్నారు. అనంతరం అర్జీదారుల నుండి వారు అర్జీలను స్వీకరించారు.

### పుంగనూరులో పెద్దిరెడ్డి

# రాజ్యాంగమే నడుస్తోంది

### రాజంపేట పార్లమెంటరీ అధ్యక్షులు జగన్‌మోహన్‌రాజు

**మదనపల్లె, మార్చి 17 ప్రభాతవార్త :**



రామక్రిష్ణ కుటుంబీకులకు నగదు అందజేస్తున్న దృశ్యం

రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం మారి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా పుంగనూరులో మాత్రం పెద్దిరెడ్డి రాజ్యాంగమే నడుస్తోందని రాజంపేట పార్లమెంటరీ టిడిపి అధ్యక్షులు చమర్తి జగన్‌మోహన్‌రాజు తెలిపారు. రాజంపేట పార్లమెంటరీలో భాగమైన పుంగనూరు నియోజకవర్గం క్రిష్ణాపురంలో హత్యకు గురైన టిడిపి కార్యకర్త కాగితి రామక్రిష్ణ కుటుంబీకులను ఆయన సోమవారం పరామర్శించారు. ఈ సందర్భంగా విలేకర్లతో మాట్లాడుతూ పార్టీ అధిష్టానం ఆదేశాల మేరకు చిత్తూరుజిల్లా అధ్యక్షులు సిఆర్.రాజన్,ఖాధీ కార్పోరేషన్ ఛైర్మెన్ కెకె.చౌదరి, పుంగనూరు అబ్జర్వర్ భాస్కర్ యాదవ్‌తో కలసి రామక్రిష్ణ కుటుంబీకులకు ధైర్యం చెప్పడం జరిగిందన్నారు. హత్యా రాజకీయాలు ప్రోత్సహిస్తున్న వారిపై ప్రభుత్వం ఉపక్షించదు అన్నారు. చట్టప్రకారం శిక్షపడడం ఖాయమన్నారు. గ్రామాల్లో శాంతియుత వాతావరణం ఉంటేనే అభివృద్ధి జరుగుతుందన్నారు. గుండాలు, అరాచక శక్తులను ప్రభుత్వం వెంటనే అనిచివేస్తుందన్నారు. అనంతరం రామక్రిష్ణ కుటుంబీకులకు ఖర్మకర్చులకు గానూ ఆయన రూ.లక్ష నగదును కుమారులైన శివ, శ్రీనివాసులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు దొరస్వామినాయుడు, బిసిసెల్ మోడెం సిద్దప్ప, నీలకంఠ, మార్వూరి రమేష్, నాదేళ్ల అరుణ్‌తేజ్‌లు పాల్గొన్నారు.

## గంజాయి విక్రయిస్తున్న ఇద్దరు వ్యక్తులు అరెస్ట్

**బద్వేలు, మార్చి 17, ప్రభాతవార్త**




కడప జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ఉత్తర్వుల మేరకు మైదుకూరు సబ్ డివిజనల్ ఆఫీసర్ జి. రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో బద్వేల్ అర్బన్ ఇన్స్పెక్టర్ రాజగోపాల్, ఎస్ఐలు సత్యనారాయణ, రవికుమార్ లు సిబ్బంది కలిసి గంజాయి విక్రయిస్తున్న ఇద్దరినీ అరెస్టు చేసినట్లు తెలిపారు. బద్వేల్ మున్సిపాలిటీ పరిధిలోని చెన్నంపల్లె ఎస్టి కాలనీ కాశినాయన గుడి ముందర గంజాయి విక్రయిస్తున్న ఇద్దరిని అదుపులో తీసుకోగా వీరు పట్టణంలోని రాజుగారి వీధికి చెందిన దండు మనోజ్‌కుమార్, వల్లెల వారిపల్లి గ్రామానికి చెందిన రాజ్‌కుమార్‌లుగా గుర్తించారు. వారి వద్ద నుండి 1.5 కేజీల గంజాయి స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు పంపినట్లు తెలిపారు. నిషేధిత గంజాయి అక్రమ రవాణాగాని, అమ్మకాలు గానీ చేసిన వారిపై, వారికి సహకరించిన వారిపై కూడా కఠిన చర్యలు తీసుకోబడునని తెలిపారు.

## అశ్వ వాహనంపై దర్శనమిచ్చిన వేంకటేశ్వరుడు

**బద్వేలు రూరల్, మార్చి17 (ప్రభాతవార్త) :**



బద్వేలు మండల పరిధిలోని లక్ష్మిపాళెంలో వెలసిన శ్రీ ప్రసన్న వేంకటేశ్వర స్వామివార్షిక బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఇందులో బాగంగా సోమవారం స్వామివారు అశ్వవాహనంపై దర్శనమిచ్చారు. అలాగే తెల్లవారు జామునుంచే వేద పండితులు మంత్రోచ్చారణల మద్య స్వామివారికి వివిధ రకాల ప్రత్యేక పూజలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామివారి బ్రహ్మోత్సవాల సందర్భంగా బద్వేలు పట్టణ పరిసర ప్రాంతాలవారు విశేష సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. భక్తులకు ఎలాంటి ఆటంకాలు కలుగకుండా దేవాదాయ కార్యనిర్వహణాదికారి రామలింగారెడ్డి, ఆలయ ట్రస్ట్‌బోర్డు ఛైర్మన్ చాటకొండు సత్యసంజీవ్‌కుమార్, ధర్మకర్తలు భూపాళం రాఘవేంద్ర, కర్ణమడకల బీనా, నల్లి వీరమ్మ,సంపతి వెంకటసుబ్బయ్య, అనగొంది ఓబులేసు, ఒంటె చిన్న పీరయ్య, నాగయ్యగారి సిద్దమ్మ, మజ్జారి లక్షుమ్మ, మరియు గ్రామస్థులు భక్తులకు స్వామివారికి ప్రసాదాలు అందజేశారు. స్వామి వారికిఅడుగడుగునా మంచినీరు వారుపోసి తమభక్తిని చాటుకున్నారు ప్రత్యేక ఉభయదాతలుగా పగలు ఉత్సవానికి మెంటా వెంకట రామయ్య, కీ.శే.మెంటా రమణయ్య, కీ.శే. చాటకొండు చిన్న ఓబయ్య కుమారుడు కీ.శే. ఓబయ్య, కీ.శే. రంగయ్య, కీ.శే. చలమయ్య, కీ.శే. సంజీవయ్య కుటుంబ సభ్యులతో పాటు కీ.శే. కోటా సంజీవయ్య, దత్తు, కుమారుడు సంజీవరాయుడు వారికి దేవస్తానం వారిచే ప్రత్యేకంగా పూజలు నిర్వహించి ప్రసాదాలు అందజేశారు.

### సూపర్ సిక్స్ పథకాల అమలులో

# విఫలమైన కూటమి ప్రభుత్వం

**బద్వేలు ,మార్చి 17, ప్రభాతవార్త**



ఎన్నికల సందర్భంగా కూటమి ప్రభుత్వం ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాల అమలులో ఘోరంగా విపలమైందని, గత ప్రభుత్వ విధానాలనే కొనసాగిస్తూ పథకాల విషయంలో నిధుల కొరత ఉందని సాకులు చెబుతూ ప్రజలను మోసం చేస్తున్నదని, తక్షణమే ఎటువంటి ఆంక్షలు లేకుండా ప్రభుత్వ పథకాలను రేషన్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరికి వర్తింపజేసి ప్రజల పట్ల తమకున్న నిబద్ధతను నిజాయితీని నిరూపించుకోవాలని లేని పక్షంలో ప్రజాగ్రహం చవిచూడాల్సిన దుస్థితి కూటమి ప్రభుత్వానికి ఏర్పడుతుందని సిపిఐ ఎంఎల్ లిబరేషన్ పార్టీ జిల్లా నాయకులు చంద్రశేఖర్, చంద్రమోహన్ రాజులు డిమాండ్ చేశారు. సోమవారం పార్టీ కార్యాలయంలో జకరయ్య అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ తెలుగుదేశం, జనసేన ,బిజెపి లతో కూడిన కూటమి ప్రభుత్వం ఎన్నికల సందర్భంగా అనేక హామీలు ఇచ్చిందని వాటిలో ప్రధానంగా సూపర్ సిక్స్ పథకాలు పింఛన్ పెంపు మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు, ఉచితం బస్సు ప్రయానం, తల్లికి వందనం, 18 సంవత్సరాల పైబడిన వారికి నెలకు 1500 చొప్పున ఇస్తామని లాంటి పథకాలు ప్రకటించి పేద మధ్యతరగతి ఓట్లను గుంజుకొని నేడు నిధులు లేవన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఆర్థిక పరిస్థితి బాగోలేదు ప్రజలు అర్థం చేసుకోవాలి అనే మోసపూరిత మాటలు చెప్పడం కూటమి ప్రభుత్వ చేత గానితనానికి నిదర్శనమని వారు విమర్శించారు. నేడు ప్రభుత్వం గత పది సంవత్సరాలుగా నూతన రేషన్ కార్డుల మంజూరు ప్రక్రియలో నిర్లక్ష్యం వహిస్తూ తమకేమీ పట్టనట్లు జాప్యం చేస్తూ నేడు లబ్ధిదారులు అందరికీ ఎన్టీఆర్ గృహాలు మంజూరు చేస్తామని ప్రకటించడం హాస్యాస్పదమని వారు విమర్శించారు. అలాగే ఇచ్చిన ఉచిత సిలిండర్ల పథకంలో ప్రతి ఒక్కరికి న్యాయం చేస్తాం సిలిండర్ బుక్ చేసుకున్న వెంటనే సబ్సిడీ మీ అకౌంట్లో పడుతుందని మాయమాటలు చెప్పి గత ప్రభుత్వం ఇష్టారాజ్యంగా నమోదు చేసిన ఆంక్షలు యధావి ధిగా కొనసాగించడం ఎంతవరకు సమంజసమని, కూటమి ప్రభుత్వం చెప్పే విధానం చెప్పేది శ్రీరంగనీతులు దూరేది ఇంకో గుడిసెలు అనే రీతిలో ఉందని వారు ఘాటుగా విమర్శించారు. అలాగే గత ప్రభుత్వం ఇచ్చిన పథకంలో అనేకమంది మేము ఈ కొండ ప్రాంతాలకు ఎక్కలేము మాకు ఈ స్థలం అక్కర్లేదు ఇంకోచోట ఎక్కడైనా ఇవ్వండి అంటూ బద్వేల్ నియోజకవర్గంలో వేలాదిమంది ప్రజలు ప్రభుత్వం తమకు ఇచ్చిన పట్టాలను తిరిగి ఇవ్వడం జరిగిందని వారి యొక్క వివరాలను ఆన్లైన్లో తొలగించకపోవడంతో వారందరూ నేటి ప్రభుత్వ పథకమైన ఎన్టీఆర్ గృహాలు లబ్ధిదారులకు దూరమయ్యారని ఇది ప్రభుత్వ తప్పిదం కాదా అని వారు ప్రశ్నించారు. ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయాలని లేని పక్షంలో క్షేత్రస్థాయిలో ప్రజాగ్రహం చవిచూడాల్సి వస్తుందని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా నాయకులు చంద్రమోహన్రాజు, జకరయ్య నియోజకవర్గ నాయకులు రామరాజు బాబు విజయరావు విద్యార్థి సంఘ నాయకులు అనిల్ శివరాం పట్టణ నాయకులు బాబు మెరుగు చెన్నయ్య జయపాల్ చంద్రపాల్ ,నారాయణ, శాంసన్ గాయాల చెన్నయ్య లక్ష్మయ్య అబ్రహం, గుర్రప్ప తదితరులు పాల్గొన్నారు

## ప్రకృతి వ్యవసాయ పద్ధతి పంటలు ఆరోగ్య దాయకం



**జమ్మలమడుగు, మార్చి 17, ప్రభాతవార్త:**

జమ్మలమడుగు మండలంలో ఏపీసీఎన్ఎఫ్ పద్ధతిలో రసాయన పురుగు మందులు వాడకుండా ఘన ద్రవ జీవామృతాలతో ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో పండించిన పంటలను జమ్మలమడుగు ప్రభుత్వ ఆసుపత్రి వద్ద ప్రతి సోమవారం స్టాల్ పెట్టాలని డీపీఎం ఆదేశాల మేరకు స్టాల్ పెట్టడం జరిగింది. ఈ వారం జమ్మలమడుగు మండల అగ్రికల్చర్ ఆఫీసర్ ఆధ్వర్యంలో ప్రారంభించడం జరిగింది. ఏవో మాట్లాడుతూ ఈకార్యక్రమం చేయడం వలన ప్రజలకు ఆరోగ్యకరమైన, ఆహార పదార్థాలను పండించి వాటిని స్టాల్‌లో అమ్మడం మంచి కార్యక్రమమని తెలిపారు. ఈ కూరగాయలు, ఆకు కూరలు గూడెం చెరువు, పెద్దదండ్లూరు, సిరిగేపల్లి, సున్నపురాళ్లపల్లె, మరియు ఎస్.ఉప్పలపాడు గ్రామాల్లో పండించడం జరుగుతుందన్నారు. ఇవన్నీ కూడా ప్రతి సోమవారం తీసుకొని వస్తామని ఏపీసీఎన్ఎఫ్ క్యాడర్ అందరూ తెలియజేయడం జరిగింది. ఈ అవకాశాన్ని జమ్మలమడుగు ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మండల అగ్రికల్చర్ ఆఫీసర్ చంద్రశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏవో, యూనిట్ ఇన్‌ఛార్జిలు, ఐసీఆర్‌పీలు మరియు ప్రజలు పాల్గొన్నారు.

## డ్వాక్రా సంఘం నిధులు దుర్వినియోగం ఫిర్యాదు

**పీలేరు మార్చి 17 ప్రభాతవార్త :**



ఏపీఎంకు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

మండలం ముడుపుల వేముల గ్రామపంచాయతీ విద్యానగర్ ఎస్సీ కాలనీలో సరస్వతీ మహిళా సంఘం సంబంధించిన గ్రూపులో 10 లక్షల రూపాయల అవకతవకలు జరిగాయని ఆ మహిళా సంఘం వారు జిల్లా ఎస్పీని కలిసి విన్నవించుకున్నారని ఇందులో సంఘమిత్ర, గ్రూప్ లీడర్ హస్తం ఉందని వారు అధికారులకు తెలియజేసిన నేపథ్యంలో ఈ విషయంపై సమగ్ర విచారణ జరిపి నష్టపోయిన దళితులకు న్యాయం చేయాలని సోమవారం సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి టీఎల్ వెంకటేష్ పీలేరు మండల ఏపీఎం జోహార్ భాష ని కలిసి వివరణ ఇవ్వాలని వినతి పత్రం ఇవ్వడం జరిగింది ఈ విషయంపై ఏపీఎం జోహార్ భాష వివరణ ఇస్తూ సరస్వతి మహిళా సంఘం 11,9,2023 న బ్యాంకు నుంచి 15 లక్షలు లోను తీసుకున్నారని క్రమం తప్పకుండా కడుతూ కొన్ని నెలలు కట్టలేనిది వాస్తవమేనని కానీ వారు లోన్ తీసుకొని 17 నెలలు కావస్తున్నా ఇప్పటి బ్యాంక్ స్టేట్మెంట్ ప్రకారం 15 నెలలు కట్టారని ఇంక మిగిలినది 2 నెలలు మాత్రమేనని ఈ విషయం జిల్లా అధికారులకు తెలియజేశామని, ఇక్కడ ఎవరికీ అన్యాయం చేయమని అందరికీ న్యాయం చేస్తామని ఆయన అన్నారు.

### పట్టణ శివార్లలో

# నిర్మానుష్యమైన ప్రదేశాలలో డ్రోన్ నిఘా



డ్రోన్ నిఘా ఏర్పాటు చేస్తున్న పోలీసులు

**పోరుమామిళ్ల రూరల్, మార్చి 17 ప్రభాతవార్త:**

నిర్మానుష్యమైన ప్రదేశాలలో డ్రోన్ నిఘాతో చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు జిల్లా పోలీసులు అడ్డుకట్టవేశారు. సోమవారం సాయంత్రం పోరుమామిళ్ల పోలీస్ స్టేషన్ పరిధిలో జిల్లా ఎస్పీ ఇ.జి అశోక్ కుమార్ ఐ.పి.ఎస్ ఆదేశాల మేరకు పోరుమామిళ్ల పట్టణ శివారు ప్రాంతాల్లో బహిరంగంగా మద్యం సేవించడం ,గంజాయి సేవించడం,పేకాట, ఈవ్ టిజింగ్ తదితర నేరాల పై డ్రోన్ కెమెరాలతో నిఘా ఉంచారు. బహిరంగంగా మద్యం సేవించడం గంజాయి సేవించడం వంటి వారు పట్టుబడితే చట్ట ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందని పోరుమామిళ్ల సి.ఐ డి. శ్రీనివాసులు, ఎస్.ఐ ఆర్.వి కొండారెడ్డి హెచ్చరించారు. ఆయా ప్రాంతాల్లో బహిరంగ మద్యం సేవించడం,గంజాయి వినియోగం,పేకాట వంటి అసాంఘిక కార్యకలాపాల నిర్వహణ,ఈవ్ టీజింగ్, ఇతర నేరాలు జరగకుండా జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు చర్యలు చేపట్టడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పోరుమామిళ్ల హెడ్ కానిస్టేబుల్ దుర్గా మోహన్, సిబ్బంది పాల్గొన్నారు.

## మొక్కలు నాటండి, పర్యావర నాన్ని కాపాడండి

**చాపాడు, మార్చి 17, ప్రభాతవార్త**



మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలని భద్రకాళి సమేత శ్రీ వీరభద్ర స్వామి దేవస్థానం ఉత్సవ కమిటీ ఛైర్మెన్ పెరుగు వీరనారాయణయాదవ్ తెలిపారు. సోమవారం స్థానిక అల్లాడుపల్లె శ్రీ వీరభద్ర స్వామి దేవస్థానం నందు కార్యనిర్వాహణాధికారి, కే. శ్రీనివాసులుతో కలిసి మొక్కలు నాటే కార్యక్రమంలో చేపట్టారు. ప్రతి ఒక్కరు మొక్కలు నాటి పర్యావరనాన్ని పరిరక్షించాలని కోరారు. వీరభద్ర స్వామికి భక్తులు పెద్ద ఎత్తున అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. ఉదయం, అల్పాహారంతోపాటు, మధ్యాహ్నంఅన్నప్రసాధ వితరణ చేపట్టారు. ఈ కార్యక్రమం లో సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో ట్యాంకర్ బోల్తా

**ముద్దనూరు, మార్చి 17, ప్రభాతవార్త:**

జమ్మలమడుగు ముద్దనూరు రహదారిలోని ఘాట్ రోడ్ లో సిమెంట్ లోడుతో వెళుతున్న ట్యాంకర్ సోమవారం నాడు బోల్తా పడింది. స్థానికుల వివరాల మేరకు దాల్మియా సిమెంట్ కర్మాగారం నుంచి బెంగళూరుకు సిమెంట్ లోడుతో వెళుతున్న ట్యాంకరు ముద్దనూరు ఘాట్ రోడ్డు నందు ఏసుప్రభు శిల సమీపంలో ప్రమాదవశాత్తు లారీ ఇంజన్, ట్యాంకు విడిపోవడంతో ట్యాంక్ బోల్తా పడినట్లు తెలిపారు. ఎదురుగా ఏ వాహనాలు రాకపోవడంతో పెను ప్రమాదమే తప్పిందని అటుగా వెళుతున్న వాహనదారులు ఊపిరి పీల్చుకున్నారు. ఈ ఘటనలో లారీ డ్రైవర్ కు ఎటువంటి గాయాలు కాలేదు అని తెలిపారు.

## బి సి, ఎస్ సి, ఎస్ టి,పక్కా గృహలకు అదనపు ఆర్థిక సాయం

**సుండుపల్లె, మార్చి 17, ప్రభాతవార్త:**

గత ప్రభుత్వంలో ఇచ్చిన ప్రభుత్వ పక్కా గృహాలు వివిధ దశలలో పూర్తికాని ఇళ్ళ నిర్మాణాలలో బీసీ ఎస్సీ ఎస్టీ వర్గాల లబ్ధిదారులకు అదనపు ఆర్థిక సహాయాన్ని అందిస్తున్నట్లుగా గృహ నిర్మాణ శాఖ ఏ ఈ యం.నాగరాజ నాయక్ సోమవారం ఒక ప్రకటన ద్వారా పేర్కొన్నారు. ఇందులో భాగంగా మండలములో దాదాపు 520 మంది లబ్ధిదారులకు ఆర్థిక సహాయం అందనుందని ఆయన తెలిపారు.ఎస్టీ వర్గానికి చెందిన వారికి 75 వేల రూపాయలు ఎస్సీ, బీసీ వర్గాల వారికి 50 వేల రూపాయలు అందిస్తున్నట్లుగా ఆయన తెలిపారు. ఈ ఆర్థిక సాయం మొత్తాన్ని వివిధ దశలలో అందజేస్తున్నట్లుగా పేర్కొన్నారు. ఈ ఆర్థిక సహాయం గతంలో ప్రభుత్వం వారు అందిస్తున్న 1.8 లక్షల రూపాయలకు అదనంగా ఇస్తున్నట్లుగా పేర్కొన్నారు. బిఎల్ దశలో 50 వేల రూపాయలు, చివరి దశలో ఉన్న ఇళ్లకు 10000 లేదా 15 వేల రూపాయలు (వర్గాన్ని బట్టి) అందిస్తామని, అలాగే వివిధ దశలలో ఉన్న ఇళ్లకు ఆయా దశలబట్టి ఆర్థిక సాయం అందిస్తామని పేర్కొన్నారు. ఈనెల 15వ తేదీ నుండి 23 వ తేదీ వరకు ఇంజనీరింగ్ అసిస్టెంట్లు ఎస్సీ, ఎస్టీ బీసీ వర్గాల లబ్ధిదారుల ఇంటికి వెళ్లి ఆర్థిక సాయం గురించి తెలియపరిచి దశలవారీగా నిర్మాణంలో ఉన్న ఇళ్లకు ఆర్థిక సహాయం అందించే విధంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు.

### మామిడి పూతపై

# రైతుల ఆశలు నిరాశేనా?

### రైతులు ఆశించిన రీతిలో పిందె నిలబడేనా.

**రైల్వే కోడూరు మార్చి 17 ప్రభాతవార్త**

నియోజకవర్గం లో మామిడి పూత పై రైతులు పెట్టుకున్నా వారి ఆశలు నిరాసిగా మారే పరిస్థితులు ఉన్నాయని రైల్వేకోడూరు పట్టణంలో వ్యవసాయ రైతులు పలుచోట్ల చర్చించుకుంటున్నారు. ముఖ్యంగా గత మూడు సంవత్సరాల పైగా వ్యవసాయ రైతులు మామిడి పూత పై ఎన్నో ఆశలు పెట్టుకొని పంటను కాపాడుకోవాలని మంచి ఉద్దేశంతో వ్యవసాయ రైతులు భారీగా అప్పులు తెచ్చుకొని పూర్తిస్థాయిలో అప్పులు పాలైపోయినారని అయితే ఈ దఫా కూడా అలాగే జరుగుతుందా అన్న కోణంలో ఆందోళన మరింత రైతుల్లో పెరిగిపోతున్నది. ముఖ్యంగా ఈ దఫా మామిడి పూత విస్తారంగా రావడంతో మామిడి రైతులు ఈ దపానైన గట్టెక్కుతామోనన్న ఆనందం ఉన్నింది, కానీ అయితే ఇటీవల వాతావరణంలోని పెనుమార్పుల ద్వారా మామిడి పిందే ఉంటుందా ఊడుతుందా అన్న ఆందోళనలు రైతుల్లో విపరీతంగా కలుగుతుంది. ఏది ఏమైనాప్పటికీ రైతులు అత్యంత అప్పులతో వ్యవసాయ పంటపై ఆశలు పెట్టుకున్నారు. ముఖ్యంగా పూత తోనే వచ్చినా ఆనందాన్ని ఉంటుందా ఉండదా అన్న ఆందోళన పూతకున్న పిందె నిలబడడానికి వ్యవసాయ శాస్త్రవేత్తలు పూర్తిస్థాయిలో మామిడి రైతులతో సంబంధిత శాస్త్రవేత్తలు ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించి రైతులను ఏదో ఒక రూపంలో పిందె నిలబడే విధంగా కృషి చేసి మామిడి రైతులను ఆదుకోవాలని రైల్వే కోడూరు లోని వ్యవసాయ మామిడి రైతులు కోరుతున్నారు.



# అధ్యాపకులకు గౌరవాభివందన సభ

కడప, మార్చి17 ప్రభాతవార్త:

కె.ఎస్.ఆర్.ఎం ఇంజినీరింగ్ కాలేజ్ (ఆటానామస్), కడప ఆధ్వర్యంలో "అధ్యాపకుల విశేష సాధనలకు పురస్కారాల పంపిణీ మరియు అభినందన కార్యక్రమం" ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో పరిశోధన ప్రచురణలు, సర్టిఫికేషన్లు, ఇతర విద్యా నైపుణ్యాల్లో విశేష ప్రతిభ కనబరిచిన అధ్యాపకులకు గౌరవాభివందనలు అందజేయడంతో పాటు, ప్రోత్సాహక నగదు బహుమతులు కూడా పంపిణీ చేయబడ్డాయి.కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మూర్తి మాట్లాడుతూ, "మా అధ్యాపక బృందం చేస్తున్న పరిశోధనలు మరియు అగ్రశ్రేణి సర్టిఫికేషన్లు విద్యార్థులకు కొత్త అవకాశాలను అందిస్తున్నాయి. ఈ పురస్కారాలు వారి ప్రతిభను మరింత పదునెక్కించేందుకు ఉద్దేశించబడ్డాయి" అని పేర్కొన్నారు.కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ కె. చంద్ర ఓబుల్ రెడ్డి మాట్లాడుతూ, "గురువులు నాణ్యతతో కూడిన విద్యను అందించడమే కాదు, పరిశోధన, నవీన ఆవిష్కరణల్లో భాగస్వామ్యం కావడం ఎంతో అవసరం. ఇలాంటి ప్రోత్సాహక కార్యక్రమాలు మరింత ఉత్సాహాన్ని కలిగిస్తాయి" అని అన్నారు. గౌరవ అతిథిగా హాజరైన శ్రీ కె. మదన్ మోహన్ రెడ్డి మాట్లాడుతూ, "జ్ఞానం అనేది పంచుకుంటే పెరుగుతుంది. పరిశోధనల ద్వారా విజ్ఞానాన్ని విస్తరించడం, నూతన ఆవిష్కరణలను ముందుకు



తీసుకురావడం అధ్యాపకుల కర్తవ్యంగా మారింది. ఇలాంటి కార్యక్రమాలు అధ్యాపకుల్ని మరింత నూతన పరిశోధనలకు ప్రోత్సహిస్తాయి. విద్యా రంగం అభివృద్ధికి ఇలాంటి గొప్ప ముందడుగులు అవసరం." అని అభిప్రాయపడ్డారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ టీ ఎన్ ప్రసాద్ మాట్లాడుతూ శాస్త్రీయ పరిశోధన, నూతన ఆవిష్కరణలు మాత్రమే ఒక విద్యాసంస్థను ప్రతిష్టాత్మక శిఖరాలకు తీసుకెళతాయి అన్నారు. డాక్టర్ ఎం. వి. నారాయణ, డీన్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ మాట్లాడుతూ, " అధ్యాపకులు తమ పరిశోధనలను మరింత విస్తృతంగా జరిపి, విద్యార్థులకు విజ్ఞానాన్ని అందించాలి" అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రొఫెసర్లు, అధ్యాపక బృందం పాల్గొని విజేతలను అభినందించారు.

## మజ్జిగ, శరభత్ పంపిణీ



చిన్నమండెం మార్చి17 ప్రభాతవార్త:

కేశపురం గ్రామంలోని దేవళంపేటలో వెలసిన పాలెటమ్మ జాతరలో భక్తులకు వేసవి తాపం నుండి ఉపశమనం కల్పించదానికి ఆది,సోమవారలో చిన్నమండెం కస్బాకు చెందిన ఏ. అక్రం ఖాన్ ఆద్వర్యంలో 2000 పాకెట్ల మజ్జిగ, 400 లీటర్ల షరభత్ ను పంపిణీ చేసారు.ఈ సందర్బంగా జాతర లో భక్తుల రద్దీ ఉన్న ప్రాంతానికే అటోలలో వెళ్లి పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఖర్చుకు వెనకాడక దాదాపు రూ.50 వేలు వెచ్చించి భక్తుల దాహం తీర్చిన అక్రంఖాన్ దాతృత్వాన్ని ప్రశింసించారు. భక్తులు కృతజ్ఞతలు తెలిపారు.

## గృహ నిర్మాణ లబ్ధిదారులకు అదనపు ఆర్థిక సాయం

ముద్దనూరు, మార్చి 17, ప్రభాతవార్త:



సొంత ఇంటి నిర్మాణం కోసం ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకం కింద దరఖాస్తు చేసుకొని పలు కారణాలవల్ల తమ గృహ నిర్మాణాలను పూర్తి చేసుకోలేని ఎస్సీ, ఎస్టి, బీసి లబ్ధిదారులు అందరికీ రాష్ట్ర ప్రభుత్వం తమ గృహాల నిర్మాణాన్ని పూర్తిచేసుకొనుటకు అదనపు ఆర్థిక సహాయాన్ని ప్రభుత్వం అందిస్తుందని ఎంపీడీవో ముకుంద రెడ్డి సోమవారం నాడు విలేఖరుల సమావేశంలో తెలియజేశారు. ఈ అదనపు ఆర్థిక సహాయంలో భాగంగా ఎస్సీ, బీసీలకు 50వేల రూపాయలు మరియు ఎస్టీ సామాజిక వర్గానికి 75 వేల రూపాయలు అందిస్తున్నట్లు తెలియజేశారు. గృహ నిర్మాణాల కోసం దరఖాస్తు చేసుకుని అసంపూర్తిగా ఉన్న లబ్ధిదారులు ప్రభుత్వం అందిస్తున్న అదనపు ఆర్థిక సహాయం కోసం గ్రామ సచివాలయంలోని ఇంజనీరింగ్ అసిస్టెంట్ లేదా హౌసింగ్ అసిస్టెంట్ ఇంజనీర్ ని సంప్రదించాలని ఎంపీడీవో ముకుంద రెడ్డి తెలిపారు ఈ అవకాశాన్ని మండలంలోని గృహ నిర్మాణ లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని తెలియజేశారు,

## జనసేన పార్టీలోకి సీనియర్ రేషన్ డీలర్ నర్సారెడ్డి



యర్రగుంట్ల మార్చి 17 ప్రభాతవార్త

పట్టణ పరిధిలోని రాణి వనం 20వ వార్డులో ఉన్న సీనియర్ రేషన్ డీలర్ నర్సా రెడ్డి జనసేన పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. సోమవారం స్థానిక జనసేన పార్టీ కార్యాలయం లో నియోజకవర్గ జనసేన పార్టీ కోఆర్డినేటర్ దేరంగుల జగదీష్ సమక్షంలో పార్టీలోకి చేరారు. ఈ సందర్భంగా నర్సా రెడ్డి మాట్లాడుతూ జనసేన పార్టీ సి ద్ధాంతాలు తనకు ఎంతో ఇష్టమని, పవన్ కళ్యాణ్ నాయకత్వం, పౌర సరఫరా శాఖమంత్రి నాదెళ్ల మనోహర్ మార్గదర్శకత్వంలో పౌరసరఫరా వ్యవస్థ సమర్థం గా అమలవుతుందనే నమ్మకంతో జనసేన పార్టీలో చేరినట్లు తెలిపారు.

# 20న బహిరంగ వేలం పాట

రామసముద్రం, మార్చి17, ప్రభాతవార్త

మండలంలోని చెంబకూరు గ్రామపంచాయతీ వారపు సంత, దినసరి మార్కెట్, బస్టాండ్ గేటు బహిరంగ వేలము పాట 20వ తేది గురువారం నిర్వహించునట్లు మదనపల్లి డివిల్పిఒ కె. నాగరాజు, సర్పంచ్ జి.రమణమ్మ, ఎంపీడీవో భానుప్రసాద్, పంచాయతీ కార్యదర్శి రెడ్డిశేఖర్,పి.ఓ.పి.ఆర్ గఫూర్ తెలిపారు. ఈ వేలం పాటలో వారపు సంతకు, దినసరి గేటుకు 1లక్ష రూపాయలు, బస్టాండ్ గేటుకు 60 వేల రూపాయలు డిపాజిట్ చెల్లించి వేలంపాట పాడుకోవాలని తెలియజేశారు.

## ప్రశాంతంగా 10 వ తరగతి పరీక్ష

చిన్నమండెం మార్చి 17 ప్రభాతవార్త:

చిన్నమండెం మండల కేంద్రంలోని మోడల్ స్కూల్ లో జరిగిన 10 వ తంగతి తెలుగు పరీక్ష సోమవారం ప్రశాంతంగా జరిగింది.మండలంలోని అన్ని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలనుండి 343 మంది హాజరు కావాల్సివుండగా వందశాతం హాజరైనట్లు యం ఈ ఓ శివానాయక్ తెలిపారు. రెండు ఎగ్జామ్ సెంటర్ల వద్ద గట్టి పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసారు.

## పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేసిన ఎస్ఐ.

కలకడ మార్చి 17 ప్రభాతవార్త :

మండల కేంద్రమైన కలకడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (తెలుగు) నందు జరుగుతున్న 10వ తరగతి పరీక్ష కేంద్రాన్ని ఎస్సై రామాంజనేయులు తన సిబ్బందితో తనిఖీలు నిర్వహించినట్లు తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిష కేంద్రానికి పరిసర ప్రాంతాల్లో జిరాక్స్ సెంటర్లు ఉండరాదని 144 సెక్షన్ విధించడం జరిగిందని, ఎవరైనా పరీక్షలు జరిగే సమయంలో పరీక్ష కేంద్రం వద్ద తిరగడం గాని, ఉండడం గానీ, తెలిసినచో వారిపై కేసులను నమోదు జరుగుతుందని తెలిపారు.అలాగే పరీక్ష కేంద్రాల పరిసర ప్రాంతాల్లో జిరాక్స్ మిషన్లు ఏర్పాటు చేసుకుని ఉన్నట్లు గుర్తించినచో యజమానులపై కేసులు నమోదు చేసి జైలుకు పంపడం జరుగుతుందన్నారు.పరీక్షలను విద్యార్థులు నిర్భయంగా, స్వేచ్ఛగా రాయాలని సూచించినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో పోలీసులు ప్రతాప్, కరుణాకర, మహిళా పోలీసులు తదితరులు పాల్గొన్నట్లు తెలిపారు.



కలకడ పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న ఎస్ఐ రామాంజనేయులు

## పది పరీక్షలు ప్రశాంతం

తొలిరోజు 12 మంది విద్యార్థులు గైర్హాజరు



ప్రొద్దుటూరు అర్బన్, మార్చి 17, ప్రభాతవార్త :

రాష్ట్ర వ్యాప్తంగా సోమవారం నుండి ప్రారంభమైన 10వ తరగతి పరీక్షలు ప్రొద్దుటూరులో ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ప్రొద్దుటూరు పట్టణంలో ఏర్పాటు చేసిన 23 సెంటర్లకు గానూ 3770 మంది విద్యార్థులు పరీక్షలు రాయాల్సి వుండగా 3758 మంది హాజరవ్వగా 12 మంది గైర్హాజరయ్యారని విద్యాశాఖ అధికారులు తెలిపారు. కాగా తొలి రోజు విద్యార్థులు కాస్త త్వరగా సెంటర్ వద్దకు చేరుకుని, వారి రూమ్ ను సరి చూసుకొని పరీక్ష రాశారు. తొలి రోజు ఎక్కడా కూడా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోలేదు.

## ప్రశాంతంగా పదవ తరగతి పరీక్షలు



రామసముద్రం మార్చి 17 ప్రభాత వార్త

పదోతరగతి పరీక్షలు మండల కేంద్రం లోని జడ్పీ హైస్కూల్, ఏపీ మోడల్ స్కూల్, కస్తూరిభాగాంధీ పాఠశాలలో పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు. మూడు కేంద్రాలలో 507విద్యార్థులు గాను 502 హాజరు కాగా 5 మంది విద్యార్థులు గైర్వాజరు అయ్యారని ,ఎం ఈవో 2ఆంజనేయులు హెచ్ ఎం చిట్టిబాబు, మునిస్వామినాయక్ తెలిపారు, ఈ పరీక్షకేంద్రాలలో ప్రత్యేక అధికారి హర్షవర్ధన్ రెడ్డి , ఎస్సై జి. రవికుమార్ మాట్లాడు తూ పరీక్ష కేంద్రాలలో 144 సెక్షన్ అమలుచేశామని ప్రతిరోజు పోలీస్ సిబ్బంది పరీక్ష కేంద్రాలువద్ద నిఘాలో ఉంటారని ఎస్సై తెలిపారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు జరగకుండా చర్యలు చేపట్టినట్టు తెలిపారు.

## మండల సర్వేయర్‌గా పూర్ణచంద్ర

పీలేరు మార్చి 17 ప్రభాతవార్త:



పీలేరు మండల సర్వేయర్ గా పూర్ణచంద్ర నియామకం పీలేరులో గతంలో డిప్యూటేషన్ పై కె.వి.పల్లె నుండి పీలేరుకు మండల సర్వేయర్ గా వచ్చిన కీర్తన కొద్ది రోజులకే తమ వ్యక్తిగత కారణాల వలన సెలవు పై వెళ్లడంతో తాసిల్దార్ భీమేశ్వరరావు మండలంలో జరుగుతున్న రీ సర్వే కార్యక్రమాలపై సమగ్ర నివేదికలు తెలుసుకోవడానికి ఇబ్బందిగా ఉండటంతో జిల్లా ఉన్నతాధికారులకు మండల సర్వేలను నియమించాలని అడిగిన వెంటనే జాయింట్ కలెక్టర్ రాయచోటి డిడి లు స్పందించి వాల్మీకిపురంలో పని చేస్తున్న పూర్ణచంద్రాను ఇన్చార్జి మండల సర్వేయర్ గా నియమించడం పట్ల రైతులు రెవెన్యూ బృందం హర్షం వ్యక్తం చేశారు తహసిల్దార్ కృషితోనే అడిగిన వెంటనే మండల సర్వేలను నిర్మించినట్లు తెలిసింది ఇకనైనా పీలేరు మండలం లో మండల సర్వేలు బాధ్యతలు నిర్వహించేందుకు నూతన సర్వేర్ పూర్ణచంద్ర కృషి చేయాలని పలువురు కోరుతున్నారు.

## ప్రారంభమైన పదవ తరగతి పరీక్షలు

రైల్వే కోడూరు మార్చి 17 ప్రభాతవార్త...

మండలంలో సోమవారం నుండి కట్టుదిట్టంగా పదవ తరగతి పరీక్షలు ప్రారంభమయ్యాయి. మండలంలో దాదాపు 634 మంది విద్యార్థులు పరీక్షలు రాస్తున్నారని మండల విద్యాశాఖ అధికారి తెలిపారు. రైల్వేకోడూరు మండలంలో పలు పరీక్ష కేంద్రాలు వద్ద కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేసి పరీక్షలు నిర్వహిస్తున్నారు. అదేవిధంగా విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యం కలక్కుండా పూర్తిస్థాయిలో ఏర్పాటు చేసి విద్యార్థులకు పరీక్ష కేంద్రాల వద్ద సౌకర్యాలు ఏర్పాటు చేశారు.

## కలికిరికి చేరుకున్న మాజీ సీఎం కిరణ్‌కుమార్‌రెడ్డి

కలికిరి, మార్చి 17, ప్రభాతవార్త:

ఉమ్మడి రాష్ట్ర మాజీ సీఎం నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి సోమవారం తన సొంత మండలమైన కలికిరికి చేరుకున్నారు. అధిక సంఖ్యలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు మాజీ సీఎంకు ఘన స్వాగతం పలికారు. తమ నాయకుడు కలికిరికి వస్తున్నాడని సమాచారం రావడంతో అధిక సంఖ్యలో నాయకులు కలికిరికి చేరుకొని మాజీ సీఎంని కలిశారు. ఈ సందర్భంగా మాజీ సీఎం కిరణ్‌కుమార్‌రెడ్డి బీజేపీ నాయకులు, కార్యకర్తలతో ఆప్యాయంగా పలకరించి వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. తమ నాయకుడు ఆప్యాయంగా పలకరించడంతో ప్రజలు సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా నాయకుడు పులి నరేంద్రకుమార్‌రెడ్డి, కలికిరి మండలం బీజేపీ నాయకులు నల్లారి ఆనందరెడ్డి, పల్లవోలు రెడ్డప్పరెడ్డి, బీజేపీ అధ్యక్షుడు కుమార్‌రెడ్డి, మాజీ సీఎం వ్యక్తిగత కార్యదర్శి కృష్ణప్ప, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## శివోహం సేవలు నిర్విఘ్నంగా సాగాలి

ప్రొద్దుటూరు, మార్చి 17, ప్రభాతవార్త :

శివోహం అన్నప్రసాద సేవా సంఘం వారి సేవలు నిరాటంకంగా సాగాలని పట్టణానికి చెందిన గురు శంకర్ రెడ్డి ఆకాంక్షించారు. సోమవారం స్థానిక అగస్త్యేశ్వర స్వామి ఆలయంలో ప్రతి సోమవారం నిర్వహించే అన్నప్రసాద సేవలో భాగంగా ఆయన, భార్య విజయ, కుమార్తెలు రిషిత, సుమ, మనమడు వెంకట సాయి చరణ్ రెడ్డి సహకారంతో అన్నప్రసాద సేవ నిర్వహించారు. దాదాపు 600 మంది ఈ కార్యక్రమంలో పాల్గొని అన్న ప్రసాదం స్వీకరించారు. ఈ కార్యక్రమంలో శివోహం అన్నప్రసాద సేవా సంఘం అధ్యక్షులు శెట్టిపల్లె రాంప్రసాద్ రెడ్డి, ఉపాధ్యక్షులు డాక్టర్ మురుకూటి సూర్యనారాయణ రెడ్డి, సభ్యులు విష్ణు నారాయణ, విజయకుమార్, లింగారెడ్డి, కల్లూరు ప్రభాకర్ రెడ్డి, రమణయ్య, తదితరులు పాల్గొన్నారు.

## ప్రశాంతగా 10వ తరగతి పరీక్షలు

దువ్వూరు, మార్చి 17, ప్రభాతవార్త:

మండల కేంద్రమైన దువ్వూరులోనూ, పుల్లారెడ్డి పేటలోను సోమవారం నుంచి మొదలైన 10వ తరగతి పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. 3పరీక్షా కేంద్రాల్లో 5మంది విద్యార్థులు హాజరు కాలేదని మండల విద్యాశాఖ అధికారి పద్మలత తెలిపారు. కస్తూరిబా పాఠశాలలో 97మందికి గాను ఒక్క విద్యార్థి, పుల్లారెడ్డి పేల జిల్లా పరిషత్ పాఠశాలలో 180మందికి గాను ఇద్దరు, దువ్వూరు హైస్కూల్‌లో 186మందికి గాను ఇద్దరు విద్యార్థులు పరీక్షకు హాజరు కాలేదన్నారు. ప్రశాంతంగా పరీక్షలు జరిగేందుకు విద్యార్థుల తల్లిదండ్రులు సహకరించాలన్నారు. దువ్వూరు ఎస్ఐ వినోద్‌కుమార్ ఆధ్వర్యంలో పరీక్షా కేంద్రాల వద్ద బందోబస్తును నిర్వహించారు. అలాగే పరీక్షా కేంద్రాల వద్ద గుంపులు గుంపులుగా ఉంటే చర్యలు తీసుకుంటామన్నారు. పరీక్షా జరిగే సమయంలో దువ్వూరులోని జిరాక్స్ సెంటర్లను మూసివేయాలని ఆదేశించారు.

## 19న ఆదరణ పథకంపై అవగాహన కార్యక్రమం

రాజుపాళెం,మార్చి17,ప్రభాతవార్త.

మండల పరిధిలోని కులవృత్తుల,చేతిపనుల వారికి ఆదరణ పథకం క్రింద ప్రభుత్వం అందించు మరుగైన సాధనాలు, పనిముట్లు, గాడ్జెట్లన పొందుటకు గాను కులవృత్తుల వారికి అవగాహన కార్యక్రమంను ఈనెల 19తేదిన మండల పరిషత్ కార్యాలయంలో ఉదయం 11 గంటలకు నిర్వహించుతున్నట్లు ఎంపిడిఓ వెంకటరమణారెడ్డి తెలిపారు.కులవృత్తులు ,చేతిపనివాళ్ళకు స్థిరమైన ఆదాయంను నిర్ధారించుటకు పనిముట్ల కిట్లను అందించి కులవృత్తులను చేతిపనులను ఆదుకొనుటకు ప్రభుత్వం చేపట్టు ఆదరణ పథకం అవగాహన కార్యక్రమంలో పాల్గొని ఏఏవృత్తుల వారికి ఉపయోగమో తెలుసుకోవటంతో పాటు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవటం గురించి తెలుసుకోవటంతో పాటు అర్హులు సద్వినియోగం చేసుకోవాలని ఎంపిడిఓ తెలిపారు.

## ప్రశాంతంగా పదోతరగతి పరీక్షలు



పరీక్షా కేంద్రం వద్ద వేచి ఉన్న టెన్త్ విద్యార్థులు.

తంబళ్లపల్లె మార్చి 17 ప్రభాతవార్త ః

తంబళ్లపల్లె మండల కేంద్రంలోని మోడల్ స్కూల్, హైస్కూలులో 10వ తరగతి పరీక్షలు ప్రశాంతంగా జరిగినట్లు చీఫ్ ఎగ్జామినర్స్ కృష్ణారెడ్డి, శ్రీనివాసులు తెలిపారు. మోడల్ స్కూల్లో మొత్తం 140 మంది విద్యార్థులకు గాను 138 మంది హాజరుకాగా ఇద్దరు గైర్హాజరయ్యారు. జడ్పీ హైస్కూల్ సెంటర్లో 122 మంది విద్యార్థులకు గాను 121 మంది హాజరు కాగా ఒక్కరు గైర్హాజరయ్యారు. టెన్త్ పరీక్ష కేంద్రాల వద్ద ఎస్సై లోకేష్ రెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయగా కోసువారిపల్లి పిహెచ్సి డాక్టర్ ముని కుమార్ ఆధ్వర్యంలో పరీక్షా కేంద్రాల వద్ద వైద్య సిబ్బంది వైద్య శిబిరాలు నిర్వహించారు. విద్యార్థులకు పరీక్షలు రాయడానికి బల్లలు, తాగు నీరు, విద్యుత్ సరఫరా ఏర్పాటు చేసినట్లు చీఫ్ ఎగ్జామినర్స్ కృష్ణారెడ్డి, శ్రీనివాసులు విలేకరులకు తెలిపారు.

## రాయచోటి సబ్ జైలు విజిట్

కడప లీగల్, మార్చి 17, ప్రభాతవార్త:

ఏపీ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ అమరావతి వారి ఆదేశాల మేరకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అధ్యక్షులు మరియు జిల్లా ప్రధాన న్యాయ మూర్తి శ్రీమతి జి.శ్రీదేవి సూచనల మేరకు జిల్లా న్యాయ సేవాదికార సంస్థ సెక్రటరీ కం సీనియర్ సివిల్ జడ్జీ ఎస్.బాబాఫకృద్దీన్ రాయచోటి సబ్ జైలు లీగల్ ఎయిడ్ క్లినిక్‌ను తనిఖీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లీగల్ ఎయిడ్ క్లినిక్ ప్రాధాన్యతను తెలిపారు. జైలు లోపల ఖైదీల హక్కులు, ఉచిత న్యాయ సహాయం, లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సిస్టం, ఖైదీలతో మాట్లాడి వారి కేసు వివరాలను, ఆరోగ్య విషయాలను అడిగి తెలుసుకున్నారు. ఉచిత న్యాయ సహాయాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం జైలు పరిసరాలను, రిజిస్టర్లను పరిశీలించి తగు సూచనలను సలహాలను ఇవ్వడం జరిగింది. లీగల్ సర్వీసెస్ హెల్ప్‌ఐన్ నెంబర్ 15100పై ప్రచారం నిర్వహించడం జరిగింది. ఏవైనా సమస్యలుంటే రాయచోటి మండల న్యాయ సేవా సమితిని మరియు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కడప వారిని సంప్రదించవచ్చున్నారు. ఈ కార్యక్రమంలో రాయచోటి సబ్ జైలు సూపరింటెండెంట్, ప్యానల్ న్యాయవాది, ఖైదీలు పాల్గొన్నారు.

## 504 మంది విద్యార్థులు హాజరు



కలికిరి, మార్చి 17, ప్రభాతవార్త:

కలికిరి మండలంలో సోమవారం ప్రారంభమైన పదో తరగతి పరీక్షలకు 514 మంది విద్యార్థినీ విద్యార్థులకు 504 మంది విద్యార్తులు పరీక్షలు రాసేందుకు హాజరైనట్లు ఎంఈవో కరీముల్లా తెలిపారు. కలికిరి బాలికోన్నత ప్రభుత్వ పాఠశాల పరీక్ష కేంద్రంలో 196 మందికి 191 మంది, అలాగే కలికిరి జడ్పీ హైస్కూల్ కేంద్రంలో 209 మందికి గాను 208 మంది, మహల్ జడ్పీ హైస్కూలు పరీక్ష కేంద్రంలో 110 మంది విద్యార్తులకు 105 మంది విద్యార్థులు హాజరై పదో తరగతి పరీక్షలు రాయడం జరి గింది. కలికిరి జడ్పీ బాలికోన్నత పాఠశాలలో పరీక్ష కేంద్రం చీఫ్‌గా జయమ్మ, డిపార్టమెంటల్ అధికారిగా త్యాగరాజు, కలికిరి ప్రభుత్వ బాలుర జడ్పీ హైస్కూలు పరీక్ష కేంద్రం చీఫ్‌గా సుబ్రమణ్యం, డిపార్ట్‌మెంటల్ అధికారిగా వెంకటరమణ, మహల్ జడ్పీ హైస్కూలు కేంద్రం చీఫ్‌గా శ్రీధర్, డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్‌గా రెడ్డిశేఖర్‌లు వ్యవహరించినట్లు ఎంఈవో కరీముల్లా పేర్కొన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద కలికిరి సీఐ రెడ్డిశేఖర్‌రెడ్డి తన సిబ్బందితో పటిష్ట పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేయడంతో పదో తరగతి విద్యార్తులు ప్రశాత వాతావరణంలో పరీక్షలు రాయడం జరిగింది. పరీక్షా కేంద్రాల వద్ద హెడ్ కానిస్టేబుళ్ల రాజేంద్ర ప్రసాద్, మనోహర్, కానిస్టేబుళ్ల మునిరత్నం, నాగరాజు, దినేష్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## విద్యార్థులు ప్రతిభను కనపరచాలి

వేంపల్లి, మార్చి 17, ప్రభాతవార్త :

విద్యార్థులు ఏ రంగంలోనైనా ప్రతిభను కనపరచాలని మహిళా ఎంట్రప్రిన్యూర్లు రమీజా , సుస్మా అన్నారు. వేంపల్లి లోని అక్షర కళాశాలలో సోమవారం సీనియర్ విద్యార్థుల వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విలువలతో కూడిన విద్య నేటి సమాజానికి అవసరం అని వారు పేర్కొన్నారు. అక్షర కళాశాల కరస్పాండెంట్ భూమిరెడ్డి విజయభారతి మాట్లాడుతూ ఇంటర్మీడియట్ విద్యతో పాటు పోటీ పరీక్షలకు కూడా తర్ఫీదును ఇస్తున్నామని తెలిపారు. పలువురు విద్యార్థినులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. పరీక్షల అనంతరం జరుగుతున్న ఈ కార్యక్రమం లో ప్రతి విద్యార్థి సంతోషం తో గడిపారు. తెలుగు, హిందీ పాటలకు విద్యార్థినులు వేసిన నృత్యాలు అలరించాయి. ఈ కార్యక్రమం లో అక్షర అధ్యాపక బృందం విజయ్ కుమార్ రెడ్డి, సుబహాన్, ప్రదీప్ కుమార్, షాహీదా బేగం, ప్రమీల, అరిఫా, శివకేసరి పాల్గొన్నారు




## పదో తరగతి పరీక్షలకు 1492 మంది హాజరు

- 15 మంది విద్యార్థులు గైర్హాజరు

జమ్మలమడుగు, మార్చి 17, ప్రభాతవార్త:

జమ్మలమడుగులోని 10 పరీక్షా కేంద్రాలలో పదో తరగతి పబ్లిక్ పరీక్షలు సోమవారం నుంచి ప్రారంభమయ్యాయి. పది పరీక్షా కేంద్రాలకు కలిపి 1507 మంది విద్యార్థులకు గాను 1492 మంది విద్యార్థులు హాజరు కాగా 15 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని సంబంధిత అధికారులు తెలిపారు. పరీక్షలను కట్టుదిట్టంగా నిర్వహించడం జరిగిందని పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేయడంతో పాటు పోలీసులు పటిష్ట బందోబస్తు నిర్వహించారు.

## దరఖాస్తు చేసుకోండి

సిద్దవటం, మార్చి 17, ప్రభాతవార్త:

గృహ హక్కు పథకం అదనపు రుణం కోసం దరఖాస్తులు చేసుకోవాలని ఎంపీడీవో ఫణి రాజకుమారి అన్నారు. సోమవారం మండల కేంద్రమైన సిద్దవటంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ గృహ హక్కు పథకం ద్వారా లబ్ధిదారులకు ప్రభుత్వం మంజూరు చేసిన ఇళ్ల నిర్మాణానికి ఆర్థిక సాయం అందించేందుకు ప్రభుత్వం ముందుకు వచ్చిందని తెలిపారు. మండలంలో ప్రస్తుతం ఇంప్రోగ్రెస్‌లో 393 మంది గృహ లబ్ధిదారులు ఎస్సీ, ఎస్టీ, బీసీలు ఉండగా వారిలో 144 మంది ఎస్సీలు, 6 మంది ఎస్టీలు, 243 మంది బీసీ లబ్ధిదారులు ఉన్నారు. ఎస్సీ, బీసీ లబ్ధిదారులకు రూ.50వేలు, ఎస్టీ లబ్ధిదారులకు 75వేలు ఆర్థిక సాయం ప్రభుత్వం పెంచిందని తెలిపారు. పథకంలో అదనపు అవసరాల కోసం రూ.75వేలు, బ్యాంక్ రుణం రూ.2.50లక్షలు వరకు గృహ నిర్మాణం కోసం మొత్తం సహాయం. నిధులు సమయానికి అందకపోతే బ్యాంకుల ద్వారా రుణం పొందే అవకాశం ఉందని ఎంపీడీవో తెలిపారు. లబ్ధిదారులు తమ ఆధార్, రేషన్, పట్టా పత్రాలు, బ్యాంక్ ఖాతా వివరాలు నిర్మాణానికి సంబంధించిన ఆధారాలను సమర్పించాల్సి ఉంటుందన్నారు. 12 నెలల్లో నిర్మాణం పూర్తి చేయాలని లబ్ధిదారులను ప్రోత్సహించారు. మరుగుదొడ్లు కోసం ఇళ్ల నిర్మాణంలో భాగంగా మరుగుదొడ్లు కూడా నిర్మించాలని లబ్ధిదారులు గుర్తుంచుకోవాలన్నారు. ఈ విషయంలో ఎటువంటి సమస్యలు ఎదురైనా ఏఈ హౌసింగ్‌ను సంప్రదించాలని సూచించారు.

## సిద్దవటంలో ప్రశాంతంగా పరి పరీక్షలు

సిద్దవటం, మార్చి 17, ప్రభాతవార్త:



మండల కేంద్రమైన సిద్దవటం జిల్లా పరిషత్ పాఠశాలలో సోమవారం జరిగిన 10వ తరగతి పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. సిద్దవటం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రభుత్వం ఎ సెంటర్, బి సెంటర్ ఏర్పాటు చేసింది. ఏ సెంటర్‌లో 135 మంది విద్యార్థులకు గాను మొదటి రోజు తెలుగు పరీక్షకు 134 మంది హాజరయ్యారని ఒకరు గైర్హాజరయ్యారని చీఫ్ ఎగ్జామినర్ అంబేద్కర్ తెలిపారు. డిపార్ట్‌మెంట్ చీఫ్‌గా నరసింహులు వ్యవహరిస్తున్నారన్నారు. అలాగే బి సెంటర్‌లో మొత్తం విద్యార్థులు 150 మందికి గాను 49 మంది హాజరయ్యారని ఒకరు గైర్హాజరయ్యారని ఎగ్జామినర్ జమాల్‌రెడ్డి తెలిపారు. డిపార్ట్‌మెంట్ చీఫ్‌గా రామకృష్ణ వ్యవహరించారు. ఒంటిమిట్ట సీఐ బాబు పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేసి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. వైద్యసిబ్బంది వైద్యశిబిరాలు ఏర్పాటు చేశారు.

## గ్రామ పంచాయతీ కార్యదర్శులు ఎన్నిక



దువ్వూరు, మార్చి 17, ప్రభాతవార్త:

మండలంలో 23గ్రామ పంచాయతీల్లో పనిచేస్తున్న గ్రామ కార్యదర్శులు సమావేశమై సోమవారం తన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ రామకృష్ణ మాట్లాడుతూ గ్రామాల్లో వేసవి కాలంలో మంచినీటి సమస్య రాకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. అనంతరం పంచాయతీ కార్యదర్శుల గౌరవ అధ్యక్షులుగా కే.సత్యనారాయణ, మహేంద్రనాథ్ రెడ్డి, సత్యవాణిలను ఎన్నుకున్నారు. అలాగే అధ్యక్షులుగా శ్రీధర్, అబ్దుల్లా, జనరల్ సెక్రటరీగా మునీశ్వరయ్య, మునిశేఖర్, కోశాధికారిగా ప్రసాద్ రెడ్డి, ఉపాధ్యక్షులుగా సురేష్, గౌరవ సభ్యులుగా వెంకట సురేంద్ర, వెంకటేష్, జయలక్ష్మమ్మ, భూపాల్ రెడ్డి, సంపత్, మహిళా అధ్యక్షురాలిగా సంధ్య, ఉమా మహేశ్వరిలు, కోఆర్డినేటర్లుగా గోవర్ధన్ రెడ్డి, ఖాదర్ బాషలను ఎన్నుకున్నారు.

## పంచాయితీ కార్యదర్శుల సంఘం కమిటి ఏకగ్రీవం

రాజుపాళెం,మార్చి17,ప్రభాతవార్త .

మండల పరిధిలోని 1 నుండి 6 గ్రేడ్‌ల స్థాయిలలో పనిచేయుచున్న గ్రామ పంచాయితీ కార్యదర్శుల సంఘంకమిటి ఎన్నిక సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా కుశెట్టి వెంకటయ్య,ఉపాధ్యక్షులుగా శీలం నిరంజన్‌రెడ్డి, కోశాధికారిగా కె.నాగార్జున,మహిళావిభాగం ఉపాధ్యక్షురాలుగా కాంచన రామాంజనమ్మ, జనరల్ కార్యదర్శిగా ధనేశ్వరబాబు, జాయింట్ కార్యదర్శులుగా ఎస్.మహేష్, బి.పవన్‌కుమార్‌లు గౌరవ సలహాదారులుగా కొట్టే బాబు, ఎస్.ఫణీంద్ర, పి.మునిరెడ్డి, ఎస్.చెంద్రాయుడు, కార్యనిర్వాహ సభ్యులుగా ఆర్.బాలదస్తగిరిరెడ్డి, కె.నవీన్‌కుమార్, ఎస్.సతీష్, ఎం.నెఫోలియన్, ఎన్.కుశలవరెడ్డి,, బి.అంకాలయ్య, ఏ.కపిరాజు లు ఎన్నికయ్యారు. ఈకమిటి మండల పరిషత్ కార్యలయంలో ఏకగ్రీవంగా ఎన్నుకోవటం జరిగినది కమిటి వివరాలను తెలుపుతూ ధృవీకరణ పత్రంను కార్యదర్శులు ఎంపిడిఓ వెంకటరమణారెడ్డికి అందజేశారు.



**KAMALAPURAM NAGARA PANCHAYAT**

**'e' Procurement Short Tender Notice No.01/2024-25/E1 (2nd Call) To 04/2024-25/E1 and 2nd Call) Dt:17.03.2025.**

District Mineral Foundation Trust Grant 2024-25 & 15th FC Grant (1st Installment) 2022-23

| | |
|---|---|
| Est.Cost (4 no.of works) : 131.03 Lakhs | |
| Bid Document Downloading Start Time | : 18.03.2025 @10.00 AM. |
| Bid Document Downloading end date | : 21.03.2025 @ 4.00 PM. |
| Last date/Time of receipt of Tender | : 21.03.2025 @ 5.00 PM. |

Contact: Commissioner, Kamalapuram Nagar Panchayat - 9849574990.
Further details can be seen @ 'e' Procurement market place @ https://tender.apeprocurement.gov.in
Municipal Assistant Engineer, Contact No.9441096615.

Commissioner
Kamalapuram Nagara panchayat.

# క్షయ వ్యాధి పై స్వయం సహాయక బృంద సభ్యులకు అవగాహన

వాల్మీకిపురం మార్చి 17 ప్రభాతవార్త :

క్షయవ్యాధిపై స్వయం సహాయక బృంద సభ్యులకు అవగాహన అవసరం అని ఆరోగ్య విద్యాధికారి మహమ్మద్ రఫీ మరియు క్షయవ్యాధి చికిత్స పర్యవేక్షకులు నాగిరెడ్డి అన్నారు. జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి వారి ఆదేశాల మేరకు సోమవారం మండల కేంద్రంలోని స్త్రీశక్తిభవన్‌లో నిర్వహిస్తున్న మహిళా సమైక్య సమావేశంలో భాగంగా క్షయ వ్యాధి యొక్క లక్షణాలు (రెండు వారాలకు పైబడి దగ్గు,దగ్గినపుడు గళ్ళ వచ్చుట, రోజు సాయంత్రం జ్వరం రావడం, ఆయాసం, బరువు తగ్గుతా ఉండుట, ఆకలి లేకపోవుట ), దేని ద్వారా వస్తుంది(బాక్టీరియా ), ఎలా ఒకరి నుండి మరొకరికి వ్యాపిస్తుంది (ఎంగిలి తంపరలు ), వ్యాధి నిర్ధారణ(గళ్ళ పరీక్షలు, ఎక్స రే )చేసుకోవాలంటే ఎక్కడకు వెళ్ళాలి(ప్రభుత్వ అస్పత్రి )ఎవరిని సంప్రదించాలి(ఆశాకార్యకర్త ), మందులు ఎంతకాలం తినాలి,(6నెలలు )రోగికి ప్రభుత్వం తరపున ఉన్న ప్రోత్సాహకం ఏమిటి (నెలకు రూ వేయి రూపాయలు పౌష్టిక ఆహారం కొరకు )వంటి అంశాలపై అవగాహన కల్పించి కరపత్రాలు పంపిణీ చేయడం జరిగింది మ



సమావేశంలో మాట్లాడుతున్న దృశ్యం

రియు వారి అనుమానాలను నివృత్తి చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఏ. పి. ఎమ్. నరోత్తమ్ రెడ్డి, అధ్యక్షులు భూదేవి, సి.సి. మహేశ్వరీ, సంఘమిత్ర రెడ్డెప్ప అమరావతి, తులసి సభ్యులు పాల్గొన్నారు.

## కక్షసాధింపులు మాని పాలనపై దృష్టి పెట్టండి

### మాజీ ఎమ్మెల్యే దేశాయ్ తిప్పారెడ్డి

మదనపల్లె, మార్చి 17 ప్రభాతవార్త :

కూటమి ప్రభుత్వం కక్షసాధింపు మానుకొని పాలనపై దృష్టి పెట్టాలని మాజీ ఎమ్మెల్యే దేశాయ్ తిప్పారెడ్డి తెలిపారు. సోమవారం దేశాయ్ ఆసుపత్రిలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలే



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే

కర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి పదినెలలు అవుతున్నా ఎన్నికల్లో ఇచ్చిన హామీలు ఒక్కటి కూడా నెరవేర్చలేదన్నారు. కక్షసాధింపులతోనే పాలన సాగిస్తున్నారన్నారు. ముఖ్యంగా విద్యార్థులకు పీజు రీయంబర్స్‌మెంటు, అమ్మఒడి, రైతు బరోసా, మహిళలకు ఉచిత బస్సుసౌకర్యం, నిరుద్యోగబృతి లాంటివి చేపట్టకుండా ప్రజలను ప్రభుత్వం మోసగిస్తొందన్నారు. ఉమ్మడి చిత్తూరుజిల్లాలో మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కుటుంబీకులను టార్గెట్‌గా పెట్టుకొని లేనిపోని ఆరోపణలు చేయడం సమంజసం కాదన్నారు. మదనపల్లె సబ్‌కలెక్టరేట్‌లో జరిగిన దస్త్రాల దహనం కేసుల్లో కూడా పెద్దిరెడ్డి కుటుంబీకులపై అపోహాలు మోపి ఎలాంటి నిజాలు ఇంతవరకు నిగ్గు తేల్చలేదన్నారు. ఇకనైనా కక్షసాధింపులు మానుకొని కూటమి ప్రభుత్వం ప్రజలకు మంచి పాలన అందించి ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ మనూజారెడ్డి, భార్గవి, జన్నె రాజేంద్రనాయుడు, మహిళలు పాల్గొన్నారు.

## విధి నిర్వహణపై నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదు

### తంబళ్లపల్లె ఇంజనీరింగ్ అసిస్టెంట్‌కు సోకజ్ నోటీస్.

తంబళ్లపల్లె మార్చి 17 ప్రభాతవార్త ః

మండలంలో పక్కా గృహాల నిర్మాణాల ప్రక్రియలో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని ఇందుకు ఉదాహరణగా తంబళ్లపల్లె ఇంజనీరింగ్ అసిస్టెంట్ శేషాద్రిపై ఎంపీడీవో ఉపేంద్రరెడ్డి సో



సూచనలు ఇస్తున్న అధికారులు

కజ్ నోటీస్ ఇచ్చారు. సోమవారం హౌసింగ్ డి.ఈ. వెంకట్ రెడ్డి, ఏఈ సుజాతలు జిల్లా కలెక్టర్‌తో జరిగిన వీడియో కాన్ఫరెన్స్ అనంతరం మండలంలో అసంపూర్తి పక్కా గృహాలకు ప్రభుత్వం ఎస్సీ, బీసీలకు రూ50 వేలు, ఎస్టీలకు రూ75 వేలు మంజూరు చేసినట్లు చెప్పారు. లబ్ధిదారులకు ఈ అదనపు నిధుల విషయం తెలిపి పక్కా గృహాలను త్వరితగతిన నిర్మాణాలు చేపట్టే విధంగా ఇంజనీరింగ్ అసిస్టెంట్లు అవగాహన కల్పించాలని సూచించారు. వీడియో కాన్ఫరెన్స్కు తంబళ్లపల్లె ఇంజనీరింగ్ అసిస్టెంట్ శేషాద్రి సకాలంలో హాజరు కాకపోవడం పై అధికారులు ఆగ్రహం వ్యక్తం చేసి అతనికి సోకాజ్ నోటీసు ఇవ్వాలని ఆదేశించారు. ఇప్పటికైనా ఇంజనీరింగ్ అసిస్టెంట్లు పక్కా గృహాల నిర్మాణాలపై దృష్టి సారించకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్లో మండలంలో ఇంజనీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

## మహిళపై దాడికి పాల్పడ్డవారిని అరెస్టు చేయాలి

### సబ్‌కలెక్టర్‌కు ఆర్‌జిఎస్, బాస్ నాయకులు డిమాండ్



సబ్‌కలెక్టర్‌కు విన్నవిస్తున్న దృశ్యం

మదనపల్లె, మార్చి 17 ప్రభాతవార్త :

గిరిజన మహిళపై దాడికి పాల్పడ్డ మానవ మృగాలను వెంటనే అరెస్టు చేయాలని రాష్ట్ర గిరిజన సమాఖ్య(ఆర్‌జిఎస్), భారతీయ అంబేద్కర్‌సేన(బాస్) నాయకులు దివాకర్, ముత్యాలమోహన్‌లు డిమాండ్ చేశారు. ఈ సందర్బంగా సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ గుర్రంకొండ మండలం శీలంవారిపల్లెలోని గిరిజన మహిళ ఎరుకుల అలివేలు(30) దాడికి పాల్పడ్డ నక్కల సుధాకర్, నక్కల బాలక్రిష్ణలను వెంటనే అరెస్టు చేయాలన్నారు. దాడిజరిగి నాలుగు రోజులు అవుతున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం సిగ్గుగా ఉందన్నారు. దాడికి గురైన మహిళ ఆసుపత్రిలో చికిత్సలు పొందుతున్న ప్రజాప్రతినిధులు కూడా పరామర్శించకపోవడం సిగ్గుచేటని మండిపడ్డారు. గిరిజనులపై దాడులు ప్రభుత్వం అరికట్టాలన్నారు. ఈ సంఘటనపై హోంమంత్రి స్పందించాలని కోరారు. భాదిత కుటుంబాలను పరామర్శించి రక్షణ కల్పించాలన్నారు. ఈకార్యక్రమంలో గిరిజన దళిత నాయకులు వసంతమ్మ, శివప్రసాద్, చెన్నప్ప, శ్రీనివాసులు, శివనాయక్, గీత, నందీశ్వర్‌లు పాల్గొన్నారు.

## వెలుగుస్కూల్‌కు సోపాలు, టీవీలు వితరణ

మదనపల్లె, మార్చి 17 ప్రభాతవార్త :

పట్టణ సమీపంలోని అమ్మచెరువు మిట్ట వద్ద ఉన్న వెలుగు ప్రత్యేక పాఠశాలకు సోమవారం రెండు చెక్కసోపాలు, ఒక టీవీ, ఒక టేబుల్ వితరణ చేశారు. నాగరాజుగు



సోపాలు అందజేస్తున్న దృశ్యం

ప్తా, సుందరమ్మల జ్ఞాపకార్థంగా కళ్యాణ్, వెల్‌విషర్స్ సెక్రటరీ గిరీష్‌లు వెలుగు సంస్థకు విచ్చేసి దివ్యాంగులకు, వృద్ధులకు ఉపయోగకార్థకంగా వీటిని ఉచితంగా అందజేశారు. వెలుగు సంస్థ సెక్రటరీ ఎం.ఉదయమోహన్‌రెడ్డి ఈ సందర్బంగా వారికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కన్వీనర్ భాగ్యలక్ష్మి, ప్రిన్సిపాల్ లీనాకుమారి, సోషల్‌వర్కర్ గీతా, వార్డన్ స్వీటీలు పాల్గొన్నారు.

## మాజీ రాజ్యసభ సభ్యులను కలిసిన రెడ్డిసాహెబ్

మదనపల్లె, మార్చి 17 ప్రభాతవార్త :

మాజా రాజ్యసభ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి డాక్టర్ ఎన్.తులసిరెడ్డిని కాంగ్రెస్ నియోజకవర్గ సీనియర్ నాయకులు షేక్ రెడ్డిసాహెబ్ సోమవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్బంగా నియోజకవర్గంలోని ప్రజాసమస్యలను ఆ



తులసిరెడ్డిని కలిసిన రెడ్డిసాహెబ్

యన దృష్టికి తెచ్చారు. కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి తీసుకోవాల్సిన చర్యల గురించి ఆయన చర్చించారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట ఏపిసిసి జనరల్ సెక్రటరీ షేక్ అల్లాభకస్, సిఎండి గౌస్, చిన్నక్రిష్ణ, రఫి, మైనార్టీ జిల్లా అధ్యక్షులు సయ్యద్ అలి, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

## జాతరకు పోలీసు అనుమతి తప్పనిసరి

కురబలకోట, మార్చి 16 ప్రభాతవార్త :

ముదివేడులో వెలసిన శ్రీ దండుమారెమ్మ జాతరకు చాందీని బండ్లు ఏర్పాటు చేసుకునే వారు తప్పనిసరిగా ముందస్తు పోలీసు అనుమతి తీసుకోవాలని ముదివేడు ఎస్ఐ దిలీప్‌కుమార్ తెలిపారు. శ్రీదండుమారెమ్మజాతర ఈ నెల 19, 20న జరుగుతుందని జాతరకు చాందీనిబండ్లు నిర్వాహకులు పోలీసువారి అనుమతి, వారిని నిబంధనల మేరకు చాందిని బండ్లు జాతరలో అనుమతిస్తామని తెలిపారు. జాతర



ఎస్ఐ దిలీఫ్‌కుమార్

లో ఎలాంటి అంతరాయలు జరగకుండా వాలంటీర్లను ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఎలాంటి డిజేలు ఏర్పాటు చేసుకోరాదన్నారు. విద్యాసంస్థలు, ఆసుపత్రులు, ప్రార్థనాస్థలాలు, ప్రభుత్వ కార్యాలయాల వద్ద మైకులను ఏర్పాటు చేయరాదన్నారు. మహిళలు, పిల్లలు, వృద్దుల పట్ల మర్యాదగా ప్రవర్థించాలన్నారు. చాందీనిబండ్లు వద్ద ఎలాంటి రికార్డు డాన్స్‌లు అసాంఘీక కార్యకలాపాలు నిర్వహించరాదని ఆయన హెచ్చరించారు.

## ఎంబిఏ విద్యార్థులు ఇండస్ట్రీయల్ విజిట్



విద్యార్థులు కోకోకోలా ప్లాంటును సందర్శించిన దృశ్యం

కురబలకోట, మార్చి 16 ప్రభాతవార్త :

అంగళ్ళకు సమీపంలోని విశ్వం ఇంజనీరింగ్ విద్యార్థులు ఇండస్ట్రీయల్ విజిట్ నిర్వహించారని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి.రమణారెడ్డి తెలిపారు. మొదటి సంవత్సరం ఎంబిఏ విద్యార్థులు పరిశ్రమల అనుభవాన్ని పెంపుందించుకునే ఉద్దేశ్యంతో శ్రీకాళహస్తిలోని కోకోకోలా ప్లాంటు సందర్శన నిర్వహించారని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ ఉత్పత్తి నిర్వహణ, మ్యాజిస్టిమార్కెటింగ్, క్వాలిటి కంట్రోల్ మరియు వ్యాపార నిర్వహణ అంశాలపై వారికి వివరించారు. కోకోకోలా ఉత్పత్తి మేనేజర్ బాష విద్యార్థులకు ప్యాక్టరీలోని పలు అంశాలపై వివరించారు. విద్యార్థులు ఆపరేషన్ ఎపిషియన్సీ, ఉత్పత్తి నిర్వహణ, మార్కెటింగ్ డిమాండ్ వంటి కీలక అంశాలను పరిశీలించారు.

## ప్రశాంతంగా పదవతరగతి పరీక్షలు

నిమ్మనపల్లె, మార్చి 16 ప్రభాతవార్త :

మండలంలోని తెలుగుహైస్కూల్‌లో సోమవారం ప్రారంభమైన పదవ తరగతి పరీక్షలు ప్రశాంతంగాజరిగినట్లు సుబ్రమణ్యం, ఎంఈఓ పద్మావతిలు తెలిపారు. మండలంలో 326మంది హాజరు కావాల్సి ఉండగా 7మంది గైర్హాజరు అయినట్లు తెలిపారు. 144సెక్షన్ అమలులో ఉన్నందున ఎస్ఐ తిప్పేస్వామి బందోబస్తు నిర్వహించారు.

## కూటమి ప్రభుత్వానికి ప్రత్యేక కృతజ్ఞతలు

సిద్దవటం, మార్చి 17, ప్రభాతవార్త:

మండల కేంద్రమైన సిద్దవటంలో సోమవారం కడప జిల్లా పార్ట్ టైం ఇన్స్పెక్టర్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షులు చంద్రశేఖర్ మాట్లాడుతూ విద్యాశాఖలో సమగ్ర శిక్షణలో పనిచేస్తున్న ఆర్ట్స్ క్రాఫ్ట్ పీఈటీలు ఉద్యోగుల గురించి అసెంబ్లీలో రాజమండ్రి ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ పార్ట్‌టైం ఇన్‌స్పెక్టర్లు అనే పదం తీసివేయమని ఫుల్ టైం ఒకేషనల్ టీచర్స్‌గా మార్చమని మరియు ఉద్యోగ భద్రతపై విద్యాశాఖామంత్రి లోకేష్ దృష్టికి తీసుకెళ్లారని జిల్లాలోని పార్ట్ టైం టీచర్స్ అందరి తరుపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కొన్నేళ్లుగా మా సమస్యలు పరిష్కారం కాలేదని రాష్ట్ర మంత్రి స్పందించడం హర్షించదగ్గ విషయమన్నారు.

## ఇన్‌ఛార్జులతో ప్రభుత్వ వసతి గృహాలు

సిద్దవటం, మార్చి 17, ప్రభాతవార్త:

ప్రభుత్వ బాలుర వసతి గృహాల్లో హాస్టల్ పోస్టులు ఖాళీగా ఉండడంతో ఆ స్థానాల్లో ఇన్‌ఛార్జి పరిపాలన కొనసాగుతోంది. సిద్దవటం, భాకరాపేట, ఉప్పరపల్లి, సరస్వతిపురం, ఎపార్వతీపురం గ్రామాల్లో 8 ప్రభుత్వ బాలుర, బాలికల వసతి గృహాలు ఉండగా ఉప్పరపల్లి, బీసీ బాలుర, సరస్వతీపురం, బీసీ మహిళా సిద్దవటం, బీసీ బాలుర, బీసీ మహిళా ఉప్పరపల్లి, బీసీ బాలుర వసతి గృహాల్లో వార్డెన్ పోస్టులు ఖాళీ ఉండడంతో కడప, బద్వేలు పార్వతీపురం ప్రభుత్వ హాస్టల్ వార్డెన్లకు గత ఏడాది డిసెంబరులో ఇన్‌ఛార్జి బాధ్యతలు అప్పగించారు. నాటి నుంచి నేటి వరకు కొత్త పోస్టులు మంజూరు చేయక ఇన్‌ఛార్జి బాధ్యతలుగా ఉన్న వార్డెన్లకు కూడా ఇబ్బందులు తలెత్తాయి. విద్యార్థినీ విద్యార్థులకు అందించే రోజు వారి మెయింటెనెన్స్ ఖర్చు బిల్లులు కూడా మంజూరు కాక, సమస్యలు తలెత్తాయి. మండలంలో 8 హాస్టళ్లకు నలుగురు పర్మినెంట్ వార్డెన్లు ఉండడంతో సమస్య తీవ్రతకు అద్దం పడుతోంది. దీంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గత వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో బీసీ హాస్టళ్ల అభివృద్ధికి నోచుకోలేదు. కూటమి ప్రభుత్వమైన తగు చర్యలు తీసుకుంటుందని ఆశ పడిన విద్యార్థులు వారి తల్లిదండ్రులకు నిరాశ మిగులుతోంది. అధికారం చేపట్టి 9 నెలలు అవుతున్నా వార్డెన్ పోస్టులు భర్తీపై ఇంకా ఎలాంటి ప్రకటన చేయలేదు. ఈ విషయమై జిల్లా వెనకబడిన తరగతుల అధికారి భరత్‌రెడ్డిని వివరణ కోరగా సిద్దవటం మండలంలో ప్రభుత్వ హాస్టళ్ల వార్డెన్ల కొరత ఉన్నది వాస్తవమే ఉమ్మడి కడప జిల్లాలో ఉన్న అన్ని ప్రభుత్వ హాస్టల్లో జులై మాసానికి కొత్త నియామకాలు జరుగుతాయని అంత వరకు ఇన్‌ఛార్జిలుగా కొనసాగుతారన్నారు.

## అన్నదాత సుఖీభవ పథకం అమలు ఎన్నడో?

వేంపల్లి, మార్చి 17, ప్రభాతవార్త :

సూపర్ సిక్స్ హామీలలో ఒకటైన అన్నదాత సుఖీభవ పథకాన్ని రాష్ట్రములో ఎపుడు అమలు చేస్తారో రైతులకు చెప్పాలని ఏపీసిసి ముఖ్య అధికార ప్రతినిధి డాక్టర్ ఎన్.తులసిరెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం వేంపల్లి లో ఆయన విలేకర్లతో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వానికి రైతుల గోడు ఏ మాత్రం పట్టడం లేదని ఆయన ధ్వజమెత్తారు. రైతులు పండించిన ఏ పంటకూ గిట్టుబాటు ధర లభించడం లేదన్నారు. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర కూడా లభించడం లేదని వాపోయారు. అలాగే అన్నదాత సుఖీభవ పథకం అడ్రస్ లేదని మండిపడ్డారు. ప్రభుత్వం వెంటనే కొనుగోలు కేంద్రాలు తెరిచి మద్దతు ధరకు పంట ఉత్పత్తులను కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. అన్నదాత సుఖీభవ కింద ప్రతి రైతు ఖాతాకు ఈ ఏడాది బకాయిలతో కలిపి రూ.40 వేలు జమ వేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## 10 వ తరగతి పరీక్షా కేంద్రాలను ఆకస్మికంగా సందర్శించిన జిల్లా అదనపు ఎస్పీ

లక్కిరెడ్డిపల్లె; మార్చి 17,ప్రభాతవార్త

అన్నమయ్య జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు జిల్లా అదనపు ఎస్పీ (అడ్మిన్) యం.వెంకటాద్రి సోమవారం లక్కిరెడ్డిపల్లి మోడల్‌స్కూల్ లో జరుగుతున్న 10 వ తరగతి పరీక్ష కేంద్రాలను ఆకస్మికంగా సంద





ర్శించారు. ఈ సందర్భంగా పరీక్షా కేంద్రాల చుట్టూ ఉన్న పరిసరాలను, భద్రతా చర్యలు, పరీక్షలు జరుగుతున్న తీరును అదనపు ఎస్పీ పరిశీలించారు. పరీక్షలు ప్రశాంత వాతావరణంలో ఎటువంటి విమర్శలకు తావులేకుండా సమర్ధవంతంగా నిర్వహించడానికి పకడ్బందీ చర్యలు తీసుకోవాలని పోలీసు అధికారులు మరియు సిబ్బందిని ఆదేశించారు. పరీక్షలు జరుగుతున్న తీరును అధికారులను అడిగి తెలుసుకున్నారు. అన్ని పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేసామన్నారు. ప్రతిరోజు పరీక్ష పూర్తయ్యేవరకు సిబ్బంది అనునిత్యం అప్రమత్తంగా విధులు నిర్వర్తిస్తూ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పరీక్షలు ప్రశాంతమైన వాతావరణంలో సజావుగా, సాఫీగా జరగడానికి పోలీస్‌శాఖనుండి అన్ని కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నామన్నారు.

## రోడ్డును వనిపెంట గ్రామంలోనే తీసుకెళ్లాలి



మైదుకూరు, మార్చి 17, ప్రభాతవార్త:

రైతుసేవాసమితి నాయకత్వంలో సోమవారం కలెక్టర్ కార్యాలయంలో వనిపెంట గ్రామ ప్రజలు, ఆర్యవైశ్య, బ్రాహ్మణ సామాజిక వర్గీయులుతో డిఆర్‌ఓని కలిసిన రైతు సేవాసమితి జిల్లా అధ్యక్షుడు రమణ మాట్లాడుతూ మైదుకూరు, తాటిచెర్ల 167బి నేషనల్ హైవే రోడ్డుఅభివృద్ధిలో మైదుకూరు నుండి పోరుమామిళ్ల వరకు ప్రతి గ్రామంలో పాత రోడ్డునే అభివృద్ధి చేసుకుంటూ వస్తున్న నేషనల్ హైవే అధికారులు వనిపెంట గ్రామంలోనే రోడ్డు అభివృద్ధికి ఎటువంటి ఇబ్బందికర పరిస్థితులు లేకున్నా వనిపెంట గ్రామంలోనే ఎక్కువ ప్రభుత్వ స్థలం ఉన్న నేషనల్ హైవే అధికారులు కాంట్రాక్టర్లు తప్పుడు విధానాలతో ప్రస్తుతం ఉండే రోడ్డు గ్రామానికి బైపాస్ రోడ్డుగా ఊరి బయట ప్రాంతం నుంచి 100 మీటర్లతో బైపాస్‌ను బ్రాహ్మణ, ఆర్యవైశ్య సామాజిక వర్గ స్మశానం మీదుగా, మైదుకూరు ఎర్ర చెరువు కు ముదిరెడ్డిపల్లి అటవీ ప్రాంతం నుండి నీరు వచ్చే గోడేరు వంక ప్రవహించే కాలువ పక్కన ప్రమాదకరంగా బైపాస్ ఏర్పాటు చేస్తామని ప్రయత్నాలు చేయడం భావ్యం కాదని జిల్లా అధికారులు స్పందించకపోతే నేషనల్ హైవే అధికారులు చేస్తున్న ప్రయత్నాలకు వ్యతిరేకంగా హైకోర్టులో పిల్ వేసి ఆందోళనను ముందుకు తీసుకెళ్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సేవాసమితి జిల్లా ప్రధాన కార్యదర్శి కొవ్వూరు మస్తాన్ రావు, కడప మైదుకూరు నియోజకవర్గకార్యదర్శులు బలిజపల్లి శ్రీనివాసులు, మాడిశెట్టి సదాశివుడు, కడపకు చెందిన రైతు నాయకుడు శివారెడ్డి, వనిపెంట గ్రామానికి చెందిన మైదుకూరు మాజీ మార్కెట్ కమిటీ యార్డ్ చైర్మన్ కట్టారు వీరన్న, కరంశెట్టి శివగుప్త, భూమి రెడ్డి శ్రీనివాసులు, రాజా, దుర్గాప్రసాద్, రఘు, దిలీప్, రాము తదితరులు పాల్గొన్నారు.

## డంపింగ్‌యార్డ్ సమస్యలపై తాసిల్దార్‌కి వినతి

యర్రగుంట్ల మార్చి 17 ప్రభాతవార్త

నగర పంచాయతీలోని ఐసిఎల్ కాంపౌండ్, వంక మధ్యన ఉన్న మరియు కడప తాడపత్రి రోడ్డుకు దర్శనభాగాల ఉన్న ప్రభుత్వ బంజరు భూమిని డంపింగ్ యార్డ్‌కు ఉప



యోగించాలని 13 న జరిగిన మహిళ పక్ష సమావేశంలో తీర్మానించడం జరిగిందని ఆ స్థలాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపి సర్వే నెంబర్ ఎంత అని పూర్తి విస్తరణ ఎంత అన్న వివరములు సేకరించి చిన్నపిల్లల పార్కు ఉపయోగించాలని సోమవారం అఖిలపక్ష నాయకులు తహశీల్దార్‌ను కోరడం జరిగింది. ఈ సందర్భంగా తాహశీల్దార్ శోభన్ బాబు మాట్లాడుతూ విషయం ప్రభుత్వం దృష్టిలో ఉందని దాన్ని మరొక మార్పు పరిశీల జరిపి భూమి ఎంత విస్తీర్ణం ఉంది పరిశీలన చేసి డంపింగ్‌యార్డ్‌కు ఉపయోగించుకునేందుకు ప్రయత్నం చేస్తామని, ఈ విషయాన్ని స్థానిక ఎమ్మెల్యే దృష్టికి కూడా తీసుకెళ్తామన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జమ్మలమడుగు నియోజకవర్గ కార్యదర్శి సుబ్బారెడ్డి, కాంగ్రెస్ పార్టీ కిషన్ సెల్లు జిల్లా అధ్యక్షులు ఇల్లూరు కృష్ణారెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మడక శివకుమార్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ శర్మ, రిటైర్డ్ ఐఎఎస్ విష్ణు మోహన్ రెడ్డి, అఖిల భారత యువజన సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్టీఆర్ నగర్ కాలనీవాసులు ఈశ్వరయ్య, పరమేశ్వర్ రెడ్డి,తదితరులు పాల్గొన్నారు.

## బివిఎస్ హాలు వద్ద బస్సు షెల్టర్ ఏర్పాటు

ప్రొద్దుటూరు మార్చి 17 ప్రభాతవార్త

పురపాలక సంఘం పరిధిలోని బివియస్ హాల్ వద్ద వేసవి కాలం దృష్ట్యా నూతన బస్ షెల్టర్ ఏర్పాటు చేసేందుకు మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున సోమవారం



పరిశీలించారు. వేసవి కాలం కావడంతో ప్రయాణికులు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా నిర్మించేందుకు పరిశీలించి అంచనాలు తయారు చేయాలని సంబంధిత ఇంజనీరింగ్, టౌన్ ప్లానింగ్ విభాగ అధికారులకు కమిషనర్ ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఇంజనీర్ ఎస్ దస్తగిరి, అసిస్టెంట్ సిటీ ప్లానర్ నాగరాజు, మరియు మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## 19న వారపు సంత బస్టాండ్ వేలం పాట

రామసముద్రం మార్చి 17 ప్రభాతవార్త

మదనపల్లి డివిజనల్ పంచాయతీ అధికారి నాగరాజు ఆదేశాలు మేరకు మండల కేంద్రం సచివాలయం ప్రాంగణంలో ఈనెల 19 న బుధవారం వారపు సంత, బస్టాండ్ గేటు, దినసరి మార్కెట్ బహిరంగ వేలం నిర్వహించబడునని రామసముద్రం పంచాయతీ కార్యదర్శి మునిస్వామినాయక్ తెలిపారు. దినసరి మార్కెట్‌కు రూ.రెండు లక్షలు, బస్టాండ్ గేటుకు రూ.లక్ష డిపాజిట్ చెల్లించాలన్నారు. వేలం పాట పాడేవారు పంచాయతీ లో ఎలాంటి బాకీలు ఉండరాదని పంచాయతీ కార్యదర్శి మునిస్వామినాయక్ తెలిపారు.

## మొదటి రోజు హాజరైన విద్యార్థులు

ముద్దనూరు, మార్చి, 17, ప్రభాతవార్త:

మండలంలోని పదవ తరగతి విద్యార్థులకు నిర్వహిస్తున్న పదవ తరగతి పరీక్షలకు విద్యార్థులు హాజరైనట్లు మండల విద్యాశాఖ అధికారి నాగేశ్వర నాయక్, పరీక్షా కేం



ద్రాల ఇంచార్జ్ కృష్ణారెడ్డి తెలిపారు. పట్టణంలోని రెండు పరీక్ష కేంద్రాలను డిప్యూటీ విద్యాశాఖ అధికారి మీనాక్షి తనిఖీ చేశారు. జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల కేంద్రాన్ని ఫ్లయింగ్‌స్క్వాడ్ రామాంజనేయరెడ్డి పరిశీలించారు. పోలీసులు పరీక్షా కేంద్రాల వద్ద సీఐ దస్తగిరి బందోబస్తు ఏర్పాటు చేశారు.

## ఐయోడిన్ ఉప్పు వాడకం తప్పనిసరి

సుండుపల్లి, మార్చి 17, ప్రభాతవార్త:

మండల పరిధిలోని మడితాడు జడ్పీ హైస్కూల్ నందు 6నుండి 12 సంవత్సరం లోపు పిల్లలకు ఐయోడిన్ పరీక్షలు డాక్టర్ శేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగినవి. శేఖర్ రెడ్డి మాట్లాడుతు



థైరాయిడ్ రాకుండా తీసుకోవలసిన జాగ్రత్తలు మరియు ఆహారం గురుంచి చెప్పారు. మరియు ఐయోడిన్ లోపంవలన బుద్ధిమాంద్యం తో పిల్లలు పుట్టడం, వినికిడి శక్తి తగ్గడం ఎముకల పట్టుత్వం తగ్గడం, మింగాలేకపోవడం, గొంతు వాపు, బరువు పెరగడం, రొమ్ము మరియు పొట్ట కాన్సర్ రావచ్చు అనియు బరువు పెరగడం జరుగుతుందని తెలియజేసారు. ప్రతివారు తప్పనిసరిగా 150 మిల్లి గ్రాముల తీసుకోవాలన్నారు మరియు పాలు, పెరుగు మజ్జిగ, మాంసం ఆకుకూరలు మరియు చేపలు తినాలన్నారు. ఇంట్లో తప్పనిసరి గా ఐయోడిన్ ఉప్పు తప్పని సరిగా వాడాలి అని తెలియజేసారు. పిల్లల ఇళ్ల లో వాడే ఉప్పును పరీక్ష కోసం పంపారు. ఈ కార్యక్రమంలో ఎం పి హెచ్ ఇ ఒ వీరనారాయణ స్కూల్ ఉపాధ్యాయులు సి హెచ్ ఒ లు లక్ష్మి ప్రసన్న, సాల్మహన్ మరియు రమాదేవి ఆశాలు పాల్గొన్నారు.

## 10వ తరగతి పరీక్షలు మొదటిరోజు ప్రశాంతం

రాజుపాళెం, మార్చి17, ప్రభాతవార్త.

మండల కేంద్రమైనా రాజుపాళెం గ్రామంలోని జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాలలో రెండు పరీక్షాకేంద్రాలలో సోమవారం ప్రారంభమైన 10వతరగతి పరీక్షలు ప్రశాతంగా జరిగినవి. పరీక్షకేంద్రంలో 180 విద్యార్థులు పరీక్షలు వ్రాయవలసి ఉండగా ఒక్కరు మినహా 179 మంది హాజరు అయ్యారు, పరీక్షాకేంద్రం బి లో 155 మంది హాజరు కావలసి ఉండగా 154 మంది హాజరు అయ్యారు ఇలా రెండు కేంద్రాలలో ఒక్కొక్కరు గైహాజరు అయ్యారు. పరీక్ష ప్రారంభంనకు ముందే ప్లైయింగ్ స్క్వాడ్ వెంకటరామిరెడ్డి పరీక్షాకేంద్రాలను చేరుకొని పరీక్షలను తీరును పరిశీలించారు. ఎస్ఐ వెంకటరమణ పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేస్తూ పోలీసు సిబ్బందితో గట్టి భద్రత ఏర్పాటు చేశారు. ఎంఇఒ రామస్వామిరెడ్డి రెండు కేంద్రాల నిర్వహణ బాధ్యతలను నిర్వహించారు. ఏకేంద్రంలో ఛీఫ్‌గా చంద్రశేఖర్, డిఫార్టమెంటల్ అధికారిగా జనార్ధన్‌లు, బి కేంద్రంలో ఛీఫ్‌గా షేక్‌షావలి, డిఫార్టమెంటల్ అధికారిగా శ్రీనివాసులు విధులు నిర్వహించారు. మొదటి రోజు సాఫీగా ప్రశాంతంగా విద్యార్థులు పరీక్షలు వ్రాశారు.

## తోపుడుబండ్లకు రుసుం రద్దు చేయడంపై హర్షం

మైదుకూరు, మార్చి 17, ప్రభాతవార్త:

మున్సిపాలిటీ పరిధిలోని తోపుడుబండ్ల కు మార్కెట్ గేటు రుసుం మార్చి 01 తేదీ నుంచి రద్దు చేయడం పట్ల సోమవారం రాయల్ కూడలి వద్ద టిడిపి పట్టణ అధ్యక్షుడు దాసరి





బాబు, టిడిపి పట్టణ ఉపాధ్యక్షుడు యాపరాల లక్ష్మీనారాయణ మరియు ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధి కమిటీ మెంబర్ యాపరాల చిన్న ఆధ్వర్యంలో తోపుడు బండ్ల వ్యాపారులు మైదుకూరు శాసనసభ్యులు పుట్టా సుధాకర్ యాదవ్‌కి పాలాభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బురుగొళ్ల చిన్న, తుపాకుల.రమణ, బండి.అమర్నాథ్, శివ సారధి, రామిశెట్టి కిరణ్, బెల్లం.బుజ్జి, తోపుడు బండ్ల వ్యాపారులు మరియు యువకులు తదితరులు పాల్గొన్నారు.

## తహసీల్దార్ కార్యాలయంలో స్వర్ణ ఆంధ్ర స్వచ్ఛ ఆంధ్ర

ముద్దనూరు, మార్చి 17,ప్రభాతవార్త:

సోమవారం పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో స్వర్ణ ఆంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంను తహసీల్దార్ వరద కిషోర్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. జిల్లాలో



ని అన్ని గవర్నమెంట్ విభాగాల అధికారులు, సిబ్బంది రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన పిలుపు మేరకు ఖిస్వర్ణ ఆంధ్ర స్వచ్ఛ ఆంధ్రఖి కార్యక్రమాన్ని అధికారులు చేపట్టారు. తహసీల్దార్ కార్యాలయలాలు శుభ్రం చేయడంతో పాటు ఆవరణం మరియు చుట్టూ ఉన్న చెత్త చెదారం పిచ్చి మొక్కలను తొలగించి శుభ్రం చేశారు. ఈ కార్యక్రమంలో వీఆర్వో రాజశేఖర్ నాయుడు పాటు రెవిన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రశాంతంగా పదవ తరగతి పరీక్షలు

పెద్దమండెం మార్చి 17 ప్రభాతవార్త

మండలంలోని వెలుగుల్లో సిద్దవరం కేజీవీ బి కలిచర్ల ఉర్దూ తెలుగు పాఠశాలలకు కంచర సెంటర్ నందు 217 మంది విద్యార్థులు పరిసరాయాల్సి ఉండగా 9 మంది గైర్హాజర్ అయినట్లు డిపార్మెంటల్ అధికారి వెంకటాద్రి తెలిపారు అలాగే పారేపల్లి పెద్దమండెం మోడల్ స్కూల్ విద్యార్థులకు పెద్దమందరం హైస్కూల్ సెంటర్ నందు 184 మంది విద్యార్థులు పరీక్ష రాయలసీ ఉండగా ఎనిమిది మంది వేర్ హాజరైనట్లు డిపార్మెంటల్ అధికారి లక్ష్మీ రమణ తెలిపారు సెంటర్ నందు ఎలాంటి సంఘటనలు చోటు చేసుకోకుండా ముందస్తు భద్రతను ఏర్పాటు చేశారని విద్యార్థులు కావలసిన సౌకర్యాలను మంచినీరు మరియు ఆరోగ్యపరంగా చర్య తీసుకున్నట్లు అధికారులు తెలిపారు

## రాయితీపై పశు గ్రాస విత్తనాలు పంపిణీ

పెద్దమండెం మార్చి 17 ప్రభాతవార్త

మండలంలోని వెలిగల్లు కలచర్ల పెద్దమండెం పశువైద్య కార్యాలయాల్లో రాయితీపై పశుగ్రాస విత్తనాలను పంపిణీ చేయుటకు విత్తనాలు అందుబాటులో ఉన్నాయని డాక్టర్ విక్రమ్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు మొక్కజొన్న విత్తనాలను 75 రాయితీపై విత్తనాలు విక్రయిస్తున్నట్లు ఆయా సెంటర్లలో అందుబాటులో ఉన్నాయని తెలిపారు రైతులు ఆధార్ కార్డు నక్కలు తీసుకొని వైద్యశాలకు వచ్చి విత్తనాలను తీసుకువెళ్లచనే తెలిపారు ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు

## చలివేంద్రం ఏర్పాటు

తొండూరు మార్చి 17 (ప్రభాతవార్త):

స్థానిక తొండూరు నందు అంబేద్కర్ గురుకుల పాఠశాలలో పదవ తరగతి పరీక్షల జరుగుతున్న నేపథ్యంలో చలివేంద్రంను ఏర్పాటు చేశారు. ఎండాకాలం అ



త్యధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్న నేపథ్యంలో కడప జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ఆదేశాలతో తొండూరు గ్రామంలోని అంబేద్కర్ గురుకుల పాఠశాల లో ఏర్పాటు చేశారు. వేసవిలో అక్కడికి వచ్చే తల్లిదండ్రులకు విద్యార్థినీ విద్యార్థులకు దాహార్తి తీరుస్తున్న ఎస్ఐ పెద్ద ఓబున్నకు విద్యార్థులు మరియు వారి తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలుపుతున్నారు.

## ట్రాక్టర్ ట్యాంకర్ బోల్తా డ్రైవర్ మృతి

లక్కిరెడ్డిపల్లి మార్చి 17, ప్రభాత వార్త

మండలంలోని ఎర్రగుడి గ్రామపంచాయతీ లో ట్రాక్టర్ ట్యాంకర్ బోల్తా పడటంతో డ్రైవర్ రాజశేఖర్ అక్కడికక్కడే మృతి చెందాడు. రాజశేఖర్ ఎర్రిగుడి గ్రామపంచాయతీ హరిజనవాడకు చెందిన వ్యక్తిగా గుర్తించారు. ట్రాక్టర్ కు బ్రేకులు పడకపోవడంతో ఈ ప్రమాదం జరిగిందని స్థానికులు చెబుతున్నారు. మృతుడిని లక్కిరెడ్డిపల్లి. ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు యి మేరకు లక్కిరెడ్డిపల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



పోస్టుమార్టం నిమిత్తం డ్రైవర్ రాజశేఖర్ మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించనున్నట్లు తెలిపారు.

# ప్రజల సమస్యలను శ్రద్ధతో బాధ్యతగా పరిష్కారించాలి

రాయచోటి, మార్చి 17 ప్రభాతవార్త

ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా వచ్చే ప్రజల సమస్యలను శ్రద్ధతో బాధ్యతగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి అధికారులను ఆదేశించారు. రాయచోటి కలెక్టరేట్లోని పిజిఆర్ఎస్ హాలులో సోమవారం జిల్లా కలెక్టర్ అధ్యక్షతన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెసెల్ సిస్టం పిజిఆర్ఎస్) కార్యక్రమం నిర్వహించారు. మొత్తంగా 300 అర్జీలను జిల్లా కలెక్టర్ స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల సమస్యలను అత్యంత ప్రాధాన్యతతో బాధ్యతగా పరిష్కరించాలన్నారు. ముఖ్యమంత్రి కార్యాలయం కూడా ఫిర్యాదుల పరిష్కారం పై నేరుగా పర్యవేక్షణ చేయడం జరుగుతోందన్నారు. ప్రతి సమస్యను మరియు ప్రజల నుంచి వచ్చే ఫీడ్ బ్యాక్ ను ప్రభుత్వం సీరియస్ గా పరిశీలిస్తోంది. కాబట్టి అధికారులందరూ ప్రాధాన్యతగా ఫిర్యాదులను నూరు శాతం పరిష్కరించాలన్నారు. ఇప్పటికే పెండింగ్లో ఉన్న బియాండ్ ఎస్ఎల్ఏ దరఖాస్తులపై వెంటనే చర్యలు తీసుకుని పరిష్కరించాలన్నారు. సమస్యను పట్టుకొని పరిష్కారం కోసం ఎంతో ప్రయాసతో ప్రజలు అధికారుల వద్దకు వస్తారని, వారి సమస్యను సావధానంగా వినాలన్నారు. సమస్య ఏమిటి, దానిని ఎలా పరిష్కరించాలన్న విషయాలపై అధికారులకు అవగాహన ఉండాలని, చిత్తశుద్ధితో ప్రజల సమస్యలను నాణ్యతగా పరిష్కరించాలని కలెక్టర్ పేర్కొన్నారు. అనంతరం వివిధ సమస్యలతో



వచ్చిన ప్రజల నుండి అర్జీలను స్వీకరించారు. ఎన్నో వ్యయ ప్రయాసలతో, సుదూర ప్రాంతాల నుంచి జిల్లా కేంద్రం రాయచోటికి వచ్చిన అర్జీదారులకు జిల్లా కలెక్టర్ స్నాక్స్, వాటర్ బాటిల్, టీ సౌకర్యాలను కల్పించారు. అర్జీ దారులు ఈ సౌకర్యాలను వినియోగించుకొని ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంయుక్త కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్, డిఆర్ఓ మధుసూదనరావు, ఆర్డీవో శ్రీనివాసులు, ఎస్.డి.సి రమాదేవి, వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# తల్లిదండ్రుల పిల్లలపై శ్రద్ధచూపండి

కురబలకోట, మార్చి 16 ప్రభాతవార్త :





ప్రసంగిస్తున్న దృశ్యం

తల్లిదండ్రులు పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని మిట్స్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ రామనాథన్ అన్నారు. సోమవారం మిట్స్ ఇంజనీరింగ్కళాశాలలో మొదటి సంవత్సరం విద్యార్థుల పేరెంట్స్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ పిల్లలు కళాశాలకు క్రమంగా హజరవుతున్నారా, పరీక్షల్లో వారి పనితీరు ఎలా ఉందని కళాశాలకు విచ్చేసి ఆరా తీయాలన్నారు. కళాశాలలో విద్యార్థులకు కల్పిస్తున్న సదుపాయాలను కూడా ఆరా తీయాలన్నారు. తల్లిదండ్రులు వారి పిల్లలపై ఉన్న మమకారంతో పాటు వారిని సరైన బాటలో సత్ప్రవర్థనలతో నడుచుకునేలా చూసుకోవాలన్నారు. విద్యార్థులకు లక్ష్యసాధనకు అనువైన మార్గాల గురించి సోధించాలని తల్లిదండ్రుల ప్రోత్సాహంతో విజయం వైపు సాగాలన్నారు. ఆత్మవిశ్వాసంతో అవరోధాలను అధిగమించితే విజయం తద్యం అన్నారు. ఈకార్యక్రమంలో కళాశాల విభాగాదిపతులు, కోఆర్డినేటర్ డాక్టర్ చంద్రమోహన్, సుబ్బారావు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# అత్యంత ఘనంగా పాలేటమ్మ జాతర

చిన్నమండెం మార్చి 17 ప్రభాతవార్త:



మండలంలోని కేశాపురం గ్రామం దేవళంపేట వద్ద మాండవ్య నది ఒడ్డున వెలసిన మహిమాన్వుతురాలు కోరిన కోర్కెలు తీర్చే కొంగుబంగారం పాలెటమ్మ తల్లీ జాతర ఆది, సోమవారాలలో దేవాలయం కమిటీ ఆద్వర్యంలో ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా శనివారం నడిగడ్డపల్లె వాసుల సిద్దల బోనాలతో ప్రారంభమైన ఉత్స వాలు సోమవారం సాయంత్రం వరకు కొనసాగాయి. మొక్కుబడులున్న భక్తులు దాదాపు 14 చాందిని బండ్లు కట్టి వివిధ సాముస్కృతిక కార్యక్రమాలు, బాణసంచా పేలుళ్ళ, డప్పువాయుద్యాల మద్య యువకుల కేరింతలతో ఆలయం చుట్టూ ప్రదక్షణలు చేసి మొక్కుబడులు చెల్లించారు, సంతానం కోసం మహిళలు పెద్దఎత్తున వరపద్దారు. జిల్లావాసులే కాక ప్రక్కజిల్లాలనుండి వేలాదిమంది తరలి వచ్చి అమ్మవారిని దర్శించు కొని కొబ్బరికాయలు కొట్టి చల్లంగా చూడమ్మా పాలెటమ్మ తల్లీ అంటూ మొక్కుకొన్నారు. పోలీసులు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా గట్టి బందోబస్తు నిర్వహించారు.

# అభివృద్ధి బాటలో నడిపిద్దాం

ఈవో గురు మోహన్.





సమావేశంలో మాట్లాడుతున్న ఈవో

పీలేరు మార్చి 17 ప్రభాతవార్త :

పంచాయతీని సమిష్టి నిర్ణయాలతో అభివృద్ధి బాటలో నడిపిద్దామని వై. గురు మోహన్ పిలుపునిచ్చారు. ఈ మేరకు సోమవారం పీలేరు పంచాయతీ కార్యాలయంలో సర్వ సభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మొత్తం 72 అభివృద్ధి పనులకు ఆమోదం తెలిపారు. ఈ సందర్భంగా సర్వసభ్య సమావేశంలో ఈవో గురు మోహన్ మాట్లాడుతూ తాను పీలేరు ఈవోగా బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి చేపట్టిన అభివృద్ధి పనులకు సిబ్బంది వేతనాలకు డీజిల్ ఖర్చులు బ్లీచింగ్ పౌడర్ తదితరాలపై ఖర్చు చేసిన నిధులు వివరాలు ఎంబుక్లో నమోదు చేస్తున్నామన్నారు. గతంలో అభివృద్ధికి పనులకు సంబంధించిన కొన్ని ఏం బుక్కులు అందుబాటులో లేవని ఆ పనులకు సంబంధించి బిల్లులు పెండింగ్లో పెట్టామని ఎంబుక్లో లేనివి బిల్లులు ఎలా చెల్లిస్తామని ఆయన ప్రశ్నించారు. దీనికి బదులుగా సర్పంచ్ హబీబ్ భాషా మాట్లాడుతూ తాను సర్పంచ్గా రెండున్నర సంవత్సరం కాలం పనిచేశానని ఇదే కాలంలో రూ 3 కోట్లు వరకు అప్పులు మిగిల్చారని అధికారులు ఆరోపిస్తున్నట్లు ఆయన తెలిపారు. చేసిన అప్పులు వాస్తవమేనని ఇందుకు చేసిన ఖర్చు ప్రతి పైసాకు లెక్కలు చూపించాలని ఇందులో ఏ రకమైన అవినీతికి తావు లేకుండా పక్షపాతంగా ఖర్చు చేశాను తప్ప నిధులు దుర్వినియోగానికి ఎక్కడ పాల్పడలేదని ఈ విషయంలో ఎలాంటి విచారణకైనా సిద్ధంగా ఉన్నానని విచారణ అధికారులకు పూర్తిగా సహకరిస్తారని ఆయన తెలిపారు. ఇదిలా ఉండగా గతంలో చేసిన అభివృద్ధి పనులకు బిల్లులు చెల్లించడం లేదని సర్పంచ్ హబీబ్ భాషా చెబుతుండగా అందుకు స్పందించిన ఈవో గురు మోహన్ మాట్లాడుతూ తాను ఈవోగా బాధ్యతలు చేపట్టిన నాటినుండి చేసిన పనులకు సర్పంచ్ ఆమోదముద్ర వేయాల్సి ఉండగా అవి పెండింగ్ లో ఉన్నాయని ఈవో చెప్పారు. ఇదే విషయమై ఇరు వర్గాల నుంచి సానుకూల నిర్ణయాలు రాకపోవడంతో పెండింగ్ లో ఉండిపోయాయి. ఈ క్రమంలో ఈవో మాట్లాడుతూ పంచాయతీని ఆదర్శవంతంగా తీర్చిదిద్దడానికి అధికార, పాలక వర్గాలు సమిష్టి నిర్ణయాలతో కలిసికట్టుగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు, అందుకు సర్పంచ్ తమ వార్డు సభ్యులు ఏకీభవించడంతో సమావేశం సుఖాంతంగా ముగిసింది.

# మత్తు పదార్థాల వల్ల భవిష్యత్తు అంధకారం

ప్రొద్దుటూరు అర్బన్, మార్చి 17, ప్రభాతవార్త :

మత్తు పదార్థాల వల్ల భవిష్యత్తు అంధకారం అవుతుందని యువతపై తల్లిదండ్రులు ప్రత్యేక దృష్టి పెట్టాలని ప్రొద్దుటూరు 3 వ పట్టణ సీఐ గోవింద రెడ్డి తెలిపారు. జిల్లా ఎస్పీ ఈ.జి అశోక్ కుమార్ ఆదేశాల మేరకు 3 వ పట్టణ పి.ఎస్ పరిధిలోని వైయస్ఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో పోలీస్ కళాజాత బృందం ఆధ్వర్యంలో సోమవారం యువతా మేలుకో పేరిట మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్ధాలను వివరిస్తూ నాటక ప్రదర్శన నిర్వహించారు. పోలీస్ కళాజాత బృందం ప్రదర్శించిన నాటకం విద్యార్థులను విశేషంగా అలరించింది. ఈ సందర్భంగా 3 వ పట్టణ సి.ఐ మాట్లాడుతూ సమాజంలో యువత మత్తుకు అలవాటు పడి బంగారు భవిష్యత్తు నాశనం చేసుకుంటున్నారని, అంతేగాక చిన్నచిన్న పరిశ్రమలలో పనిచేసే కార్మికులు, కూలీలు వీటికి అలవాటు పడి కుటుంబాలు కూడా చిన్నాభిన్నం అయ్యే పరిస్థితులు దాపరిస్తున్నాయన్నారు. తల్లిదండ్రులు ఎంతో బాధ్యతగా తమ పిల్లలు ఉన్నతమైన స్థాయిలో ఉంటారని కలలుగన్న వారి కలలను కల్లలుగా చేస్తున్నారని, మత్తు పదార్థాల సేవనం వల్ల మైండ్తో పాటు, విచక్షణా శక్తిని కోల్పోతున్నారని, సామాజిక, మానసిక, శారీరక, అనారోగ్యాలు, ప్రాణాంతక వ్యాధుల బారిన పడుతూ సమాజం నుండి దూరమవుతున్నారన్నారు. పలువురు మత్తు పదార్థాలకు అలవాటు పడి, డబ్బుల కోసం నేరాలు హత్యలకు సైతం పాల్పడుతూ, మంచి భవిష్యత్తును కోల్పోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. దేశం అభివృద్ది చెందాలంటే ప్రధానంగా యువత కీలకమని, ఎవరూ మత్తు పదార్థాల జోలికి వెళ్లకూడదన్నారు. కళాశాల సమీప ప్రాంతాలలో కానీ చుట్టుపక్కల ప్రాంతాలలో కానీ ఎవరైనా మత్తు పదార్థాలు విక్రయిస్తున్నారన్న సమాచారం తెలిస్తే వెంటనే పోలీసులకు



సమాచారం అందిస్తే వారి వివరాలను గోప్యంగా కూడా ఉంచుతామన్నారు. పోలీసు యంత్రాంగం గంజాయి ఏ మూల విక్రయించినా దాడులు నిర్వహిస్తు, రూపుమాపేందుకు కఠిన చర్యలు చేపడుతున్నామని, గంజాయి ఎక్కడెక్కడ ఉందో వాటి మూలాలకు వెళ్లి చర్యలు తీసుకుంటామన్నారు. యువత మత్తుకు అలవాటు పడి భవిష్యత్తును విచ్చిన్నం చేసుకోవద్దని, ప్రతి ఒక్కరూ తమ భవిష్యత్తుకు బంగారు బాటలు వేసుకోవాలని సూచించారు. సమాజాన్ని కాపాడాల్సి న యువత బంగారు భవిష్యత్తుకు పునాదులు వేసుకోవాలని సూచించారు. ప్రాణాంతకమైన మత్తు పదార్థాలకు, మాదక ద్రవ్యాలకు నో చెప్పి బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకొని తల్లిదండ్రులు కన్న కలలను నిజం చేస్తూ ఉన్నతంగా ఎదగాలన్నారు. కార్యక్రమంలో ప్రొద్దుటూరు ఫ్యాక్షన్ జోన్ ఇన్స్పెక్టర్ కె.రమణారెడ్డి, ప్రిన్సి పాల్, అధ్యాపకులు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

# అన్నమాచార్యలో "డిజైన్ కాన్సెప్ట్లు"పై గెస్ట్ లెక్చర్



(అన్నమయ్య ప్రతినిధి ప్రభాతవార్త)

అన్నమాచార్య విశ్వవిద్యాలయం, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ (ఈసిఈ) విభాగం ఆధ్వర్యంలో 3వ బి.టెక్ ఈసిఈ విద్యార్థుల కోసం "విఎల్ఎస్ఐ డిజైన్ కాన్సెప్ట్ల"పై ప్రత్యేక గెస్ట్ లెక్చర్ ను సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వైభవ్, మేనేజర్, బెంగుళూరుకు చెందిన విఎల్ఎస్ఐ వి. శ్రీకాంత్కుమార్, ఫిజికల్ డిజైన్ ఇంజినీర్, విఎల్ఎస్ఐ, బెంగళూరు హాజరై విద్యార్థులతో మాట్లాడారు. వారు ముఖ్యంగా చిప్ అభివృద్ధి, ఈడ్ఎటూల్స్, విహెచ్డిఎల్ లాంగ్వేజ్ లాంటి ముఖ్యమైన అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. వీటికి సంబంధించిన ప్రాథమిక పరిజ్ఞానం కలిగి ఉంటే, ఎలక్ట్రానిక్స్ పరిశ్రమలో విఎల్ఎస్ఐ విభాగంలో ఉద్యోగాలు పొందే అవకాశాలు పెరుగుతాయని సూచించారు. అతిథులు, విద్యార్థులకు ఈడిఏ టూల్స్, విహెచ్డిఎల్ పై ప్రత్యక్ష శిక్షణ అందించారు. అంతేకాక, తాజా గ్రాడ్యుయేట్స్ తమ నైపుణ్యాలను మెరుగుపర్చుకొని ఇంటర్వ్యూలలో ఎలా విజయవంతమవ్వాలో వివరించారు. ఈ కార్యక్రమాన్ని డా. ఎస్.ఎం.వి. నారాయణ, ప్రిన్సిపాల్, ఏఐటిఎస్ రాజంపేట, డా. సి.హెచ్. నాగ రాజు, ఈసిఈ హెచ్ఓడి, డా. ఎస్. కరీముల్లా, డా. సి.వెంకటేశు సమన్వయంతో విజయవంతంగా నిర్వహించారు.

# గర్భిణీలు మంచి పౌష్టిక ఆహారం తీసుకోవాలి





ప్రొద్దుటూరు అర్బన్, మార్చి 17, ప్రభాతవార్త :

ప్రతి గర్భిణీ మంచి పౌష్టిక ఆహారం తీసుకోవాలని ప్రముఖ న్యాయవాది సివి జయలక్ష్మి తెలిపారు. సోమవారం సూపర్ బజార్ రోడ్డులోని కాళహస్తయ్య వీధి అంగన్వాడి కేంద్రం నిర్వాహకురాలు కల్పన సహాయంతో ఆదరణ స్వచ్ఛంద సేవా సంస్థ వారి ఆధ్వర్యంలో సివి యస్ గ్రూప్ ఆఫ్ కంపెనీస్ మరియు సివి యస్ చారిటబుల్ ట్రస్టు సహకారంతో దాదాపు 20మంది గర్భిణీలకు సామూహిక శీమంత కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఆదరణ సంస్థ గౌరవాధ్యక్షులు చిప్పగిరి ప్రసాద్, గౌరవ సలహాదారు సివి సుబ్బారావు, సిడిపిఓ హైమావతి, ప్రముఖ న్యాయవాది సివి జయలక్ష్మి విచ్చేశారు. ఈ సందర్భంగా చిప్పగిరి ప్రసాద్ మాట్లాడుతూ స్త్రీ జీవితంలో శ్రీమంతం అనేది జీవితంలో మరచిపోలేని ఘట్టమనీ తెలిపారు. సివి సుబ్బారావు మాట్లాడుతూ ప్రపంచంలో నే తల్లికి ఎంతో గొప్ప విలువ గౌరవం ఉన్నదని పేదరికంలో ఉన్న వారు కూడా ఎంతో కష్టపడి ఉన్నతమైన స్థానాలలో ఉన్నారని తెలిపారు. సామూహిక శ్రీమంతం కార్యక్రమం చేయడానికి ముందుకు వచ్చిన సివి యస్ గ్రూప్స్, ఆదరణ స్వచ్ఛంద సేవా సంస్థ వారిని అభినందించారు. అలాగే ప్రముఖ న్యాయవాది సివి జయలక్ష్మి మాట్లాడుతూ తమ తల్లితండ్రుల తరపున సేవా కార్యక్రమాలు చేయాలన్న సంకల్పంతోనే సమాజ సేవ చేస్తున్నామని తెలిపారు. అలాగే ప్రతి గర్భిణీ స్త్రీ మంచి పౌష్టిక ఆహారం తీసుకుంటే వారి బిడ్డలు ఆరోగ్యంగా పుడతారని తెలిపారు.

# శ్రీ సాయి ఇంజనీరింగ్ కళాశాలలో గెస్ట్ లెక్చర్

రాయచోటి మార్చి17 ప్రభాతవార్త

రాయచోటి శ్రీ సాయి ఇంజనీరింగ్ కళాశాలలో సోమవారం మొదటి సంవత్సరం ఇంజనీరింగ్ విద్యార్థుల కోసం సెమీ కండక్టర్స్ అంశంపై అతిథి ఉపన్యాసం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రిసోర్స్ పర్సన్ గా డాక్టర్ టి. అమర్నాథ్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల దృక్పథంలో మార్పు రావాలని, శాస్త్ర సాంకేతిక రంగంలో వచ్చే మార్పులను ఎప్పటికప్పుడు అందిపుచ్చుకోవాలని, కష్టపడే మనస్తత్వం విద్యార్థులు అలవర్చుకోవాలని, విద్యార్థుల ఆలోచనలు సానుకూలంగా ఉంటూ ఆచరణాత్మకతపెంపొందించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ ఎం. సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ , అన్ని సబ్జెక్టుల యందు కఠినమైన పాఠ్యాంశాలను, అపార బోధన రంగం మరియు పరిశ్రమలలో అనుభవం ఉన్న అధ్యాపకులచే కళాశాలలో గెస్ట్ లెక్చర్ కార్యక్రమాల ద్వారా సులువుగా అర్థమయ్యే రీతిలో డిజిటల్ విధానం ద్వారా అందించే బోధన సౌకర్యాలను విద్యార్థిని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని తెలియజేశారు. అంతేకాకుండా కళాశాలలో కమ్యూనికేషన్ స్కిల్స్, అర్థమెటిక్, రీజనింగ్, క్యాంపస్ రిక్రూట్మెంట్ ట్రైనింగ్ తరగతులకు హాజరై నైపుణ్యాలను పెంపొందించుకుని విద్య ఉద్యోగ అవకాశాలను మెరుగుపరుచుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా రిసోర్స్ పర్సన్ డాక్టర్ టి. అమర్నాథ్ రెడ్డి ని కళాశాల యాజమాన్యం ఘనంగా సన్మానించి జ్ఞాపికను బహుకరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సి పల్ డాక్టర్ వి. బాలాజీ, సైన్స్ అండ్ హ్యూమానిటీస్ విభాగాధిపతి డాక్టర్ ఎన్ .నాగేంద్ర, అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.





ఎండిన చెట్లకు నీరు అందిస్తున్న టిడిపి యువనేత

# ఎండుతున్న చెట్లకు నీరందించిన టిడిపి నేత

తంబళ్లపల్లె మార్చి 17 ప్రభాతవార్త ః

వేసవి ప్రభావంతో ఎంపీడీవో కార్యాలయంలో ఎండుతున్న చెట్లకు మంత్రి లోకేష్ యువగళం పాదయాత్ర చేసిన యువనేత అన్నగారిపల్లి బాలాజీ నీరందించి అందరి చేత శభాష్ అనిపించుకున్నాడు. కార్యాలయానికి వచ్చే వందలాదిమంది చెట్ల నీడ లేక ఇబ్బంది పడుతున్న సమస్యను గుర్తించిన బాలాజీ వెంటనే సొంత నిధులతో ట్యాంకర్లతో నీటిని తెప్పించి చెట్లకు అందించాడు. ఈ విషయమై ఎంపీడీవో ఉపేందర్ రెడ్డి, ఏవో థామస్ రాజా, సీనియర్ అసిస్టెంట్ బాలకృష్ణ, జూనియర్ అసిస్టెంట్ విజయ్, టైపిస్ట్ సురేంద్రలతో పాటు టిడిపి నాయకులు మండల ఉపాధ్యక్షుడు కృష్ణమూర్తి నాయుడు, తెలుగు యువత ఉపాధ్యక్షుడు నరసింహులు, వీరాంజనేయులు, పురుషోత్తం, సుధాకర్ రెడ్డి,

# సమస్యలపై కార్మికులు విధులు బహిష్కరణ

మున్సిపల్ కార్యాలయం వద్ద నిరసనలు



నిరసన తెలుపుతున్న కార్మికులు

మదనపల్లె, మార్చి 17 ప్రభాతవార్త :

పారిశుద్ధ్య కార్మికుల సమస్యలు పరిష్కారం చేయాలని సోమవారం విధులు బహిష్కరించి మున్సి పల్ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర మున్సి పల్ వర్కర్స్ యూనియన్ అన్నమయ్య జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ మస్తాన్, సురేష్కుమార్, నాగరాజులు మాట్లాడుతూ 2022 ఫిబ్రవరి నెలలో పారిశుద్ధ్య విభాగంలో పనిచేస్తున్న కార్మికులకు పనిముట్లు ఇస్తామని చెప్పి ఇంతవరకు ఇవ్వలేదన్నారు. అంతేకాకుండా ఈపిఎఫ్, ఏఎస్ఏలో నెలకొన్న సమస్యలు దీర్ఘకాలికంగా ఉన్నాయన్నారు. మదనపల్లె మున్సిపాలిటిలో కౌంటర్ ఏర్పాటు చేసి పారిశుద్ధ్య, ఇంజనీరింగ్ విభాగాల్లో పనిచేస్తున్న కార్మికులకు ఈపిఎఫ్, ఈఎస్ఐ సమస్యలను పరిష్కరించాలన్నారు. 80 మంది కార్మికులకు మూడునెలలుగా వేతనాలు ఇవ్వకుండా పెండింగ్లో పెట్టారన్నారు. పెండింగ్లో ఉన్న వేతనాలతో పాటు నూనె, సోపులు, బట్టలు, చెప్పులు, కుట్టుకూలీలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం కమీషనర్కు వినతిపత్రం అందజేసి హామీ ఇవ్వడంతో నిరసనలను విరమించారు. ఈ కార్యక్రమంలో నాయకులు ముభారక్, తిరుమలప్ప, వృద్విరాజ్, ఇంద్రాణి, గంగులప్ప, నాగరాజు, వంశీ, శంకర్ప్రసాద్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

# అవగాహన సదస్సు



కడప, మార్చి17 ప్రభాతవార్త:

మేధా సంపత్తి హక్కులు సంయుక్తంగా ఏపీ ఎంఎస్ఎంఈ ఎన్ఐ ఎంఎస్ఎంఈ కెయస్ఆర్ఎం ఇంజనీరింగ్ కళాశాలలో మేధా సంపత్తి హక్కులపై విద్యార్థులకు సోమవారం అవగాహన కల్పించారు. ఎంఎస్ఎంఈ గవర్నమెంట్ ఆఫ్ ఇండియా, కె యస్ ఆర్ ఎం ఇంజనీరింగ్ కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ముఖ్య అతిథి డిస్ట్రిక్ట్ ఇండ ట్రీస్ సెంటర్ జనరల్ మేనేజర్ చాంద్ బాషా మాట్లాడుతూ కాపీ రైట్, ట్రేడ్ మార్కులు, పేటెంట్లు, మౌలిక సూచనలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఐపీ ఓ శైలజ, ఎన్ఐఎంఎస్ఎం ఈ డైరెక్టర్ స్వప్న కోఆర్డినేటర్ హనుమంత్ రావు మరియు గెస్ట్ ఫ్యాకల్టీ మహేష్ పాటిల్ మరియు వ్యాపార ఇంటెలెక్చువల్ ప్రాపర్టీ ఫెసిలిటేషన్ (ఎంఎస్ డా. హెచ్ఎస్ అఫ్జల్ బాషా, బీ.టెక్ ఈయర్, ఎంబీఏ విద్యార్థులు పాల్గొన్నారు కోఆర్డినేటర్ హెచ్ఓడి డాక్టర్ చెన్నకేశవ రెడ్డి. మరియు కె హేమంత్ కుమార్ రెడ్డి. పాల్గొన్నారు.

# భాజపా మండలాధ్యక్షుడిపై వ్యతిరేక జ్వాలలు...



ఖాజీపేట, మార్చి 17, ప్రభాతవార్త:

భాజపా మండల అధ్యక్షునిగా పోకల శ్రీకాంత్రెడ్డి ఎన్నికను వ్యతిరేకిస్తున్నట్లు ఖాజీపేట భాజపా నాయకులు విలేకరుల సమావేశంలో వెల్లడించారు. ఈ సంధర్భంగా భాజపా సీనియర్ నేత మద్దూరి హరిభాస్కర్ రెడ్డి మాట్లాడుతూ దేశంలో అతిపెద్దదైన దశాబ్దాల చరిత్ర కలిగిన కాంగ్రెస్ పార్టీని ఢీకొని 15సంవత్సరాల కాలం నుండి భారతదేశాన్ని పరిపాలిస్తున్న అతి పెద్ద పార్టీ భారతీయ జనతా పార్టీ. నియోజకవర్గాల్లో తన బలాన్ని పెంచుకుం టున్న స్థితిలో మైదుకూరు నియోజకవర్గంలో ప్రత్యేకించి ఖాజీపేటలో పార్టీ మనుగడ ప్రశ్నార్ధకంగా మారుతుంది. దానికి కారణం ఎవరిని సంప్రదించుకుండా నియమించిన నూతన భారతీయ జనతా పార్టీ మండల అధ్యక్షుని నియామకమే. మండల కమిటీని సంప్రదించకుండా ఆయన్ని ఎన్నిక చేయడం బాధాకరం అని అన్నారు. భాజపా ఎస్సీ మోర్చా మండల అధ్యక్షులు దాసరి ఉదయ్ మాట్లాడుతూ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం 2024లో పనిచేసిన పోకల శ్రీకాంత్ రెడ్డిని కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే స్వలాభం కోసం పార్టీ మారిన అతన్ని భాజపా మండల అధ్యక్షునిగా నియమించడం చాలా దారుణం అని వాపోయారు. రెడ్డి సంఘం అధ్యక్షులు భాజపా కార్యకర్త మంచాల రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ గతంలో వైకాపా విజయం కోసం శ్రమించిన ఒక పాఠశాల యజమాన్ని భాజపాలోకి వచ్చి ఉన్నత స్థాయి పదవిని పొందాడు అని, ఆయన అనునీయుడైన ఒకే ఒక్క కారణంలో ఎవరిని సంప్రదించకుండా శ్రీకాంత్ రెడ్డిని మండల అధ్యక్షునిగా ఎనుకున్నారు. అధ్యక్షునిగా ఎన్నికై దాదాపు నాలుగు నెలలు కావస్తున్నప్పటికి ఒక బూతు స్థాయి కమిటి నియామకము కానీ లేదా పాత కమిటిలోని ఏ ఒక్క వ్యక్తిని కలుపుకొని పోయే మనస్తత్వం కలిగిన వ్యక్తి కాకపోవడం గమనార్హం అని కనీసం పార్టీ పరంగా ఏ ఒక్క కార్యక్రమానికి లేదా హిందుత్వంపైన జరిగిన ఏ ఒక్క సంఘటనను ఖండిస్తూ కనీసం ఒక పత్రిక ప్రకటన ఇవ్వడానికి కూడ ధైర్యం చేయలేని ఆయన్ని మండల అధ్యక్షునిగా నియమిస్తే ఆయన సారధ్యంలో తాము ఏ విధంగా భాజపా బలోపేతానికి కృషి చేయాలని, ఇకనైన అధిష్టానం ఈ విశయంపై పునరాలోచించాలని కోరారు. విలేకరుల సమావేశంలో మద్దూరి హరిభాస్కర్ రెడ్డి, మంచాల రాజశేఖర్ రెడ్డి, దుగ్గిరెడ్డి శివప్రసాద్ రెడ్డి, దుద్దికుంట ఎరికల్ రెడ్డి, తుమ్మలూరు అశోక్ రెడ్డి, నరహరి మాలకొండయ్య, భాజపా ఎస్సీ మోర్చా మండల అధ్యక్షుడు దాసరి ఉదయ్, మద్దిక శివరామిరెడ్డి మరియు పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఎరువుల పేరుతో రైతులకు, మార్క్ఫెడ్కు 15లక్షలు శఠగోపం

దువ్వూరు, మార్చి 17, ప్రభాతవార్త:

మండల పరిధిలోని యర్రబల్లె రైతు సేవా కేంద్రంలో పనిచేస్తున్న బహుళ ప్రయోజన వ్యవసాయ విస్తరణ అధికారి ఎరువుల పేరుతో రైతులకు 2లక్షల రూపాయలు, ఏపీ మార్క్ఫెడ్కు సుమారు 12లక్షల రూపాయలు శఠగోపం పెట్టినట్లు ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి వెళితే..యర్రబల్లె రైతు సేవా కేంద్రంలో ఎంపీఈగా పనిచేస్తున్న శివకుమార్ రెడ్డి తన పరిధిలోని రైతులకు కడప మార్క్ఫెడ్ నుండి వివిధ రకాల రసాయనిక ఎరువులు వస్తే వాటిని రైతులకు విక్రయించి ఆ డబ్బులను మార్క్ఫెడ్కు జమచేయాలి. అలాగే ఏపీ విత్తనాల సంస్థ ద్వారా వచ్చిన విత్తనాలను రైతులకు అమ్మి ఆ డబ్బులను కూడ విత్తనాభివృద్ధి సంస్థకు జమ చేయాలి. అలాగే రైతులకు మార్క్ఫెడ్ నుండి ఎరువులు తెప్పిస్తానని ఆశ చూపి ముందుగానే సుమారు 10మంది రైతుల వద్ద నుండి 2లక్షల రూపాయలు తీసుకున్నట్లు యర్రబల్లె రైతే సేవా కేంద్రం పరిధిలోని గోపులాపురం రైతులు అధికారులకు వ్రాత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. గత ఏడాది సెప్టెంబర్, అక్టోబర్ నెలలో వరి ఎక్కువగా సాగు చేస్తున్నందున యర్రబల్లె రైతు సేవా కేంద్రానికి డీఏపి, కాంప్లెక్స్ ఎరువులు సరఫరా చేశారు. అలాగే విత్తనాభివృద్ధి సంస్థ ద్వారా జీలగలు, పెసలు సరఫరా చేశారు. వాటిని ఎంపీఈఓ ఎప్పటికప్పుడు రైతులకు విక్రయించి ఆ సొమ్మును మార్క్ఫెడ్కు గాని విత్తనాభివృద్ధి సంస్థలకు గానీ జమ చేయలేదు. ఈ విశయం అక్టోబర్లో వెలుగు చూసిన మార్క్ఫెడ్ అధికారులు నోటీసులు జారీ చేస్తున్నారే తప్ప ఆ డబ్బులు వసూలు చేసుకునేందుకు ప్రయత్నాలు చేయలేదని తెలుస్తోంది. కేవలం మార్క్ఫైడ్, విత్తనాభివృద్ధి సంస్థకు సుమారు 12లక్షల రూపాయలు చెల్లించవలసి ఉంది. అలాగే రైతులకు 2లక్షల మేరా చెల్లించాల్సి ఉంది. యర్రబల్లె రైతు సేవా కేంద్రం పరిధిలో ఎంపీఈఓ మార్క్ఫెడ్కు, విత్తనాభివృద్ధి సంస్థకు, రైతులకు 15లక్షల మేర చెల్లించాల్సి ఉంటుంది. గత 5నెలలుగా డబ్బులు చెల్లించకపోయినా అతనిపై ఎటువంటి చర్యలు తీసుకోలేదు. ప్రస్తుతం అతను సెలవులో ఉన్నట్లు తెలుస్తోంది. ఎరువుల పేరుతో 15లక్షల రూపాయల మేర ప్రభుత్వానికి, రైతులకు ఎగురగొట్టినట్లు తెలిసింది. ఈ విశయంపై మండల వ్యవసాయ అధికారి అమర్నాథ్ రెడ్డి మాట్లాడుతూ మార్క్ఫెడ్కు, విత్తనాభివృద్ధి సంస్థకు ఎంపీఈఓ డబ్బులు చెల్లించవలసి ఉందని అతను ఇంతవరకు చెల్లించలేదన్నారు. రైతులు కూడ తనకు వ్రాత మూలకంగా ఫిర్యాదు చేశారని, ఈ విశయాన్ని కూడ పై అధికారులకు తెలియజేశానన్నారు. అయితే మార్క్ఫెడ్కు, విత్తనాభివృద్ధి సంస్థలకు చెల్లించవలసిన డబ్బుల్లో తమ ప్రమేయం ఉండదని నేరుగా మార్క్ఫెడ్ ఖాతాకే ఎంపీఈఓలు జమ చేస్తారన్నారు. ప్రస్తుతం ఈ విశయంపై విచారణ జరిపి తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు. అలాగే అధికారుల సూచన మేరకు తదుపరి చర్యలు చేపట్టేందుకు సిద్ధం అవుతున్నట్లు తెలిపారు.

# ప్రశాంతంగా మొదలైన పది పరీక్షలు

పీలేరు మార్చి 17 ప్రభాతవార్త :

2024-25 విద్యా సంవత్సరం 10వ తరగతి పబ్లిక్ పరీక్షలు సోమవారం ప్రశాంతంగా మొదలయ్యాయి. పీలేరు మండల పరిధిలో ఒక్క ప్రభుత్వ ఉన్నత పాఠశాల, 14 జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, నాలుగు గురుకుల విద్యాలయాలు, 11 ప్రైవేట్ పాఠశాలలకు చెందిన 10వ తరగతి విద్యార్థుల కోసం 9 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. వీటిలో ఏడు పరీక్షా కేంద్రాలు పీలేరు పట్టణంలో ఏర్పాటు చేయగా మరో రెండు పరీక్ష కేంద్రాలు మండల పరిధిలోని తలుపుల, రేగళ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేశారు. పీలేరు పట్టణంలోని ఏడు పరీక్ష కేంద్రాల్లో రెండు పరీక్షా కేంద్రాలను ప్రైవేటు విద్యా సంస్థల్లో నిర్వహిస్తున్నారు. అన్ని ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థలకు చెందిన మొత్తం 1509 మంది విద్యార్థులకు గాను 1500 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. మొదటి రోజు పరీక్షకు 9 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. పరీక్షలు ప్రశాంతంగా నిర్వహించేందుకు విద్యాశాఖ అధికారులు తగిన చర్యలు చేపట్టారు. అలాగే పరీక్షా కేంద్రాల వద్ద స్థానిక సీఐ యుగంధర్ 144 సెక్షన్ విధించి, పోలీసు బందోబస్తును ఏర్పాటు చేశారు.



# పెన్షనర్ల సమస్యలు వెంటనే పరిష్కరించాలి

పీలేరు మార్చి 17 ప్రభాతవార్త :

ప్రభుత్వ కమిషనర్ల సమస్యలను వెంటనే పరిష్కరించాలని పీలేరు తాలూకా పెన్షనర్ల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు వగళ్ల చంద్రారెడ్డి, ఎర్రమరాజు అన్నారు. సోమవారం పీలేరు తహశీల్దారు భీమేశ్వర రావు ద్వారా సోమవారం ముఖ్యమంత్రికి నివేదించుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 12వ. పిఆర్సి కమీషన్ ప్రకటించాలని, ఐ ఆర్ ప్రకటించాలని, గత పిఆర్సి, డి ఆర్ బకాయిలు మంజూరు చేయాలని, అడిషనల్ క్వాంటంను పూర్వ పద్ధతిలో 70 సంవత్సరాలకు 10 శాతం, 75 సంవత్సరాలకు 15 శాతం వంతున పునరుద్ధరించాలని, పూర్తిస్థాయిలో ఈహెచ్ఎస్ వైద్య సేవలు పూర్తిస్థాయిలో అందేలా నిధులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేస్తూ తహశీల్దారుకు వినతి పత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో పలువురు పెన్షనర్లు పాల్గొన్నారు.





తహశీల్దారుకు వినతి పత్రం సమర్పిస్తున్న ప్రభుత్వ పెన్షనర్లు